


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 271 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) పచురణ : డాక్టర్ బి.ఆర్. అంబెద్కర్ కోనసీమ జిల్లా శుక్రవారం 7 ఆగస్టు 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 271 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : Dr. B.R. AMBEDKAR KONASEMA DIST FRI 7 AUGUST 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,Thadepalligudem,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

## బొండా ఉమా రౌడీలను పోగేసి దాడికి పాల్పడ్డారు



- వైసీపీ దీక్షా శిబిరంపై అధికారమదంతో బొండా ఉమా దాడి చేశారన్న పేర్ని నాని
- ఇలాంటి దాడులు రాష్ట్ర చరిత్రలో మాయని మచ్చలా మిగిలిపోతాయని వ్యాఖ్య
- ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయన్న పేర్ని నాని

పెన్ పవర్ డెస్క్:విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో వైసీపీ చేపట్టిన నిరాహార దీక్షా శిబిరంపై టీడీపీ శ్రేణులు దాడి చేసి టెంట్‌ను తొలగించారంటూ మాజీ మంత్రి పేర్ని నాని మండిపడ్డారు. స్థానిక ఎమ్మెల్యే బొండా ఉమా అధికారమదంతో రౌడీలను పోగేసి ఈ దాడికి పాల్పడ్డారని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్ర రాజకీయ చరిత్రలోనే అధికార పార్టీ జరుపుతున్న ఇటువంటి దాడులు ఒక మాయని మచ్చగా మిగిలిపోతాయని విమర్శించారు. బొండా ఉమా

- మిగతా 2లో

## పరామర్శల పేరుతో బలప్రదర్శన ఎందుకు?

### జగన్‌పై మంత్రి అనిత విమర్శలు




- పరామర్శల పేరుతో బలప్రదర్శన చేస్తున్నారని ఆరోపణ
- నిందితులను పరామర్శిస్తున్నారని విమర్శ
- జగన్ పర్యటనల వీడియోలు ప్రదర్శించిన అనిత
- అంబులెన్స్‌కు దారి ఇవ్వలేదని వైకాపాపై ఆరోపణ
- పరామర్శల వల్ల ముగ్గురు చనిపోయారని ఆరోపణ
- ప్రజలకు ఏం సందేశం ఇస్తున్నారని ప్రశ్న

- మిగతా 2లో

## చంద్రబాబు, లోకేశ్ జోలికొస్తే తోలు తీస్తాం

### వైసీపీ నేతలకు బొండా ఉమా తీవ్ర హెచ్చరిక

- విజయవాడలో వైసీపీ నేతల దీక్షపై బొండా ఉమా ఫైర్
- డీఎస్సీపై చర్చకు రమ్మంటే పారిపోయారని ఎద్దేవా
- వెల్లంపల్లి ఎక్కడ కనిపిస్తే అక్కడ కట్టేస్తామని హెచ్చరిక



పెన్ పవర్ డెస్క్:ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ లపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని టీడీపీ ఎమ్మెల్యే బొండా ఉమా తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో వైసీపీ నేతలు చేపట్టిన నిరాహార దీక్ష వద్ద చోటుచేసుకున్న పరిణామాలపై ఆయన ఘాటుగా స్పందించారు. డీఎస్సీ నిర్వహణలో అక్రమాలు జరిగాయంటూ ఆరోపణలు చేయడంపై మండిపడిన ఆయన... అసలు అక్రమాలపై చర్చకు రమ్మంటే వైసీపీ నేతలు పారిపోయారని ఎద్దేవా చేశారు. పోలీసుల అనుమతి లేకుండా రోడ్డుపై కూర్చుని చంద్రబాబు, లోకేశ్‌లను బూతులు తిడితే సహించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. "శాంతియుతంగా నిరసన

- మిగతా 2లో



## ఎన్నికలకు సిద్ధంకండి..

### ప్రతి ఇంటి వద్ద కనీసం 3 నిమిషాలు ఉండండి:

### మంత్రులకు నారా లోకేశ్ సూచన

- స్థానిక ఎన్నికలు అనుకున్న సమయానికే జరుగుతాయన్న నారా లోకేశ్
- భారీ విజయం లక్ష్యంతో క్షేత్రస్థాయికి వెళ్లాలని సూచన
- ఎల్-నినో పరిస్థితులపై అసెంబ్లీ వేదికగా ప్రజలకు స్పష్టత ఇవ్వాలన్న లోకేశ్


పెన్ పవర్ డెస్క్:రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, అసెంబ్లీ సమావేశాల్లో లేవనెత్తాల్సిన ప్రజా సమస్యలపై తన సహచర మంత్రులకు నారా లోకేశ్ దిశానిర్దేశం చేశారు. స్థానిక పోరు

- మిగతా 2లో

## వైసీపీ అరాచకాలకు చెక్ పెట్టడానికి రెండు నిమిషాలు చాలు

### కేబినెట్ భేటీలో చంద్రబాబు

- రాజకీయం ముసుగులో జగన్ నేరాలకు పాల్పడుతున్నారన్న చంద్రబాబు
- డీఎస్సీపై వైసీపీ శ్రేణులు కావాలనే వివాదాలు సృష్టిస్తున్నారని విమర్శ
- వైసీపీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని కూటమి శ్రేణులకు పిలుపు



పెన్ పవర్ డెస్క్:రాజకీయం ముసుగులో మాజీ సీఎం జగన్ తీవ్ర నేరాలకు పాల్పడుతున్నారని, వైసీపీ నేతల అరాచకాలకు చెక్ పెట్టడానికి తమకు కేవలం రెండు నిమిషాలు చాలని ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ఘాటుగా హెచ్చరించారు. అమరావతి సచివాలయంలో జరిగిన కేబినెట్ సమావేశంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. పారదర్శకంగా నిర్వహించిన డీఎస్సీ ప్రక్రియపై కోర్టు చివాట్లు పెట్టినా పట్టించుకోకుండా వైసీపీ శ్రేణులు కావాలనే వివాదాలు సృష్టిస్తూ రాద్ధాంతం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.డీఎస్సీ వ్యవహారంలో వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని, తప్పుడు ఆరోపణలను క్షేత్రస్థాయిలో గట్టిగా తిప్పికొట్టాలని టీడీపీ నేతలు, శ్రేణులకు సీఎం సూచించారు. జగన్ ఎక్కడైనా పరామర్శలకు వస్తున్నారంటేనే అసలు ఏం జరుగుతుందోనని జనాలు భయపడే పరిస్థితి దాపురించిందని ఎద్దేవా చేశారు.

## చేనేతలకు సీఎం చంద్రబాబు కానుక.. ఒక్కో కుటుంబానికి రూ.25 వేల ఆర్థిక సాయం

- 'నేతన్న సేవలో' పథకం కింద ప్రతి చేనేత కుటుంబానికి రూ.25 వేల సాయం
- చేనేత దినోత్సవం సందర్భంగా చీరాలలో సీఎం చేతుల మీదుగా పథకం ప్రారంభం
- రాష్ట్రవ్యాప్తంగా 71,536 కుటుంబాలకు రూ.179 కోట్ల ప్రయోజనం
- ఉచిత విద్యుత్, 50 ఏళ్లకే పింఛన్లతో పాటు పలు సంక్షేమ పథకాల అమలు
- చీరాల పర్యటనలో నేతన్నలతో ముఖాముఖి భేటీ కానున్న సీఎం చంద్రబాబు



- మిగతా 2లో



### డేటా సెంటర్ల హబ్‌గా హైదరాబాద్..

## విశాఖపై ప్రపంచ దిగ్గజాల చూపు

- విశాఖపై పెరుగుతున్న పెట్టుబడిదారుల ఆసక్తి
- నైట్ ఫ్రాంక్ నివేదికలో ముంబయికి ప్రపంచ టాప్-15లో చోటు
- హైదరాబాద్‌కు భారీ ప్రాజెక్టుల వరుస
- విశాఖలో గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్టుల అవకాశాలు
- క్లౌడ్, ఏఐతో పెరుగుతున్న డిమాండ్
- భారత్‌కు బలపడుతున్న గ్లోబల్ గుర్తింపు

- మిగతా 2లో

## పోలవరం-బనకచర్లకు కేంద్రం బ్రేక్.. ఏపీ ప్రతిపాదన వెనక్కి

- పర్యావరణ ప్రతిపాదనను వెనక్కి పంపిన కేంద్రం
- ఈఏసీ నివేదికల ఆధారంగా నిర్ణయం
- ట్రిబ్యునల్ తీర్పుపై అభ్యంతరాలు
- పొరుగు రాష్ట్రాల ఆందోళనలను గుర్తుచేసిన కేంద్రం
- సీడబ్ల్యూసీ అనుమతులు తప్పనిసరని సూచన
- వివాదాల తర్వాతే కొత్త దరఖాస్తు పంపాలని హితవు

- మిగతా 2లో



## రైతుల కోసం కేంద్రం రూ.23,731 కోట్ల 'గోబర్ధన్' పథకం

- పథకానికి కేంద్ర క్యాబినెట్ ఆమోదం
- పశువుల పేడ, వ్యవసాయ వ్యర్థాలకు పెరగనున్న డిమాండ్
- సీబీజీ ఉత్పత్తిని పది రెట్లు పెంచే లక్ష్యం
- సీబీజీకి ప్రభుత్వం మద్దతుతో స్థిర ధర
- కొత్త బయోగ్యాస్ ప్లాంట్లకు రూ.2 కోట్ల వరకు సాయం
- గ్రామీణ ఉపాధి, పెట్టుబడులకు ఊతం

- మిగతా 2లో





### హైదరాబాద్ వాసులకు చల్లని కబురు..

## శనివారం వరకు వర్షాలు


- హైదరాబాద్‌లో శనివారం వరకు ఉరుములతో కూడిన వర్షాలు
- ప్రస్తుతం 12 శాతంగా ఉన్న వర్షపాతం లోటు తగ్గే అవకాశం
- తెలంగాణ వ్యాప్తంగా సాధారణ స్థాయిలోనే వర్షపాతం నమోదు
- కామారెడ్డి జిల్లాలో అత్యధికంగా అదనపు వర్షపాతం

- మిగతా 2లో


## యూపీఐపై ఛార్జీలకు లోక్‌సభ గ్రీన్ సిగ్నల్..

- యూపీఐ సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం
- వాయిస్ ఓటుతో చర్చ లేకుండానే బిల్లు పాస్
- యూపీఐపై ఛార్జీలకు చట్టపరమైన మార్గం
- ఎండీఆర్ మినహాయింపు నిబంధన తొలగింపు
- పెద్ద వ్యాపారులకే ఛార్జీలు వర్తించే అవకాశం
- సాధారణ వినియోగదారులకు ప్రభావం ఉండదని సంకేతాలు

- మిగతా 2లో




పెన్ పవర్ డెస్క్:డిజిటల్ చెల్లింపులకు సంబంధించి కీలక మార్పులకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు విధించే అవకాశానికి మార్గం సుగమం చేసే 'పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ (సవరణ) బిల్లు-2026'ను లోక్‌సభ గురువారం మూజువాణి ఓటుతో ఆమోదించింది. ఎలాంటి చర్చ లేకుండానే బిల్లు పాస్ అయింది.ప్రస్తుతం




## డీప్‌ఫేక్‌లపై కేంద్రం ఉక్కుపాదం.. 3 గంటల్లో తొలగించాల్సిందే

- డీప్‌ఫేక్‌లపై కేంద్రం కఠిన నిబంధనలు
- సున్నితమైన ఫిర్యాదుల పరిష్కారానికి 2 గంటలే
- ఏఐ కంటెంట్‌కు గుర్తింపు వివరాలు తప్పనిసరి
- ఆటోమేటెడ్ వ్యవస్థలతో పర్యవేక్షణ
- డీప్‌ఫేక్ గుర్తింపునకు ఐఐటీల సాంకేతికత
- ఫిర్యాదుల కోసం అప్పీల్ వ్యవస్థ, 'సహయోగ్' పోర్టల్

పెన్ పవర్ డెస్క్:సోషల్ మీడియాలో కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో రూపొందుతున్న డీప్‌ఫేక్ వీడియోలు, ఆడియోలు, ఫొటోలకు అడ్డుకట్ట వేసేందుకు

- మిగతా 2లో

## కొత్త ఉద్యమానికి కాక్రోచ్ పార్టీ శ్రీకారం.. దేశవ్యాప్తంగా 'క్యా బోల్తీ పబ్లిక్?'

- సెప్టెంబర్ నుంచి 'క్యా బోల్తీ పబ్లిక్?' ప్రచారం
- దేశవ్యాప్తంగా ప్రజలతో నేరుగా సంభాషణ
- విద్య వ్యాణిజ్యీకరణపై సీజేపీ విమర్శలు
- ఫీజుల భారం తగ్గించాలని డిమాండ్
- నిరుద్యోగాన్ని ప్రధాన సమస్యగా ప్రస్తావన
- ఎన్నికలకు దూరంగా ఉంటామని స్పష్టీకరణ

పెన్ పవర్ డెస్క్:జంతర్‌మంతర్‌లో నీట్ ప్రశ్నాపత్రం లీక్‌లపై చేపట్టిన ఆందోళనల తర్వాత దేశవ్యాప్తంగా ప్రజల్లోకి వెళ్లాలని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నిర్ణయించింది. సెప్టెంబర్ నుంచి 'క్యా బోల్తీ పబ్లిక్?'



- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# జనం వచ్చారని గెలిచినట్లేనా? ఎత్తుగడలు ఎక్కడ?

వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఎక్కడకు వెళ్లినా జనం పోటెత్తుతున్నారు. ప్రాంతాలకు అతీతంగా ఆయనకు జేజేలు కొడుతున్నారు. కానీ ఆ జేజేలు ఓట్ల రూపంలో మారతాయా? అన్నది పెద్ద డౌటు. ఎందుకంటే జగన్ పర్యటనలకు వచ్చిన జనం ఎన్నికల సమయంలో ఓట్లు వేస్తారన్న గ్యారంటీ లేదు. జన సమూహాన్ని చూసి ఇక తాము గెలిచినట్లేనని వైసీపీ సీనియర్ నేతలు మాత్రం మురిసి పోవడం లేదు. ఎందుకంటే జగన్ కు ఇప్పటి నుంచి కాదు. 2012లో వైసీపీ పార్టీ పెట్టిన నాటి నుంచి జగన్ ఎక్కడ పర్యటనలకు వెళ్లినా వేలాది మంది వస్తున్నారు. స్థానిక నేతలు వారిని తరలిస్తున్నారా? లేక స్వచ్ఛందంగా తరలివస్తున్నారా? అన్నది పక్కన పెడితే వారిని చూసి గెలిచేస్తామనుకుంటే అంతకు మించిన వెర్రితనం మరొకటి ఉండదన్న కామెంట్స్ వినపడుతున్నాయి.

**బయటకు వస్తే చాలు...**

గత పధ్నాలుగేళ్ల నుంచి జగన్ బయటకు వస్తే చాలు.. అది ఏ పర్యటన అయినా.. ఏ ప్రాంతమయినా తండోపతండాలుగా తరలి వస్తున్నారు. కానీ జగన్ గెలిచింది కేవలం 2019 మాత్రమేనన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని అన్నారు. జగన్ కు వచ్చే జనాలను చూసిన వారికి ఎవరికైనా ప్రతి ఎన్నికల్లో జగన్ గెలుస్తారని భావిస్తారు. కానీ 2014, 2024లోదారుణ ఓటమికి గల కారణాలను మాత్రం ఇప్పటికీ వైసీపీ అధినేత జగన్ తెలుసుకోలేకపోతున్నారని అంటున్నారు. అనేక అంశాలు ఎన్నికలలో ప్రభావితం చేయనున్నాయి. కేవలం జన బలం మాత్రమే కాదు. యాటిట్యూడ్, విధానాలు, అభ్యర్థు ఎంపిక వంటి అంశాలు కీలకంగా పనిచేస్తాయి. అంతే తప్ప జనం వచ్చినంత మాత్రాన గెలిచినట్లు కాదని, రానంత మాత్రాన ఓడినట్లు కాదని కొందరు ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నారు.

**చేయాల్సిందిదీ...**

జగన్ పర్యటనల్లో జనసందోహాన్ని చూసిన వారు ఎవరైనా ఇంత ఫాలోయింగ్ ఏంటి సామీ అని ఆశ్చర్యపడకమానరు. ఇటీవల కాలంలో ఆయన వరసగా పర్యటనలు చేస్తున్నారు. శ్రీకాకుళం, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి జిల్లాల్లో జగన్ పర్యటనలు వైసీపీ నేతల మాటల్లో సూపర్ సక్సెస్ అయ్యాయి. నిజమే.. సూపర్ సక్సెస్ అయింది నిజమే కాని దాని వల్ల అధికారం లభిస్తుందా? అన్నది పెద్ద సందేహం. ఎందుకంటే ఎన్నికల్లో ఎలక్షనీరింగ్ ముఖ్యం. ఇందులో టీడీపీని కొట్టేవారు లేరు. ఒక స్కెచ్ ప్రకారం, చంద్రబాబు వ్యూహాల ప్రకారం ఎన్నికల వేళ ఫలితం తారుమారయ్యేటట్లు చేయగలరు. అందుకే జనాన్ని చూసి గెలిచామని ఊహించుకుని ఊహల లోకంలో విహరించడం కంటే ...క్షేత్రస్థాయిలో బూత్ లెవెల్ కమిటీలను బలోపేతం చేసుకోవడం, అభ్యర్థుల ఎంపిక సక్రమంగా చేయడం, ప్రత్యర్థుల ఎత్తులు ముందుగానే పసిగట్టి వాటికి పై ఎత్తులు వేస్తేనే గెలవగలమని ఉత్తరాంధ్ర సీనియర్ నేత ఆఫ్ ది రికార్డుగా వ్యాఖ్యానించడాన్ని ఎవరూ కాదనలేరు. ఈ విషయాన్ని జగన్ తెలుసుకుంటే మంచిదని అంటున్నారు.

## డీప్‌ఫేక్‌లపై కేంద్రం ఉక్కుపాదం.. 3 గంటల్లో తొలగించాల్సిందే

- మొదటి పేజి తరువాయి

కేంద్ర ప్రభుత్వం నిబంధనలను మరింత కఠినతరం చేసింది. అక్రమ కంటెంట్‌పై ఫిర్యాదు అందిన మూడు గంటల్లోనే తొలగించాలని మధ్యవర్తి వేదికలకు (ఇంటర్మీడియరీలు) ఆదేశాలు జారీ చేసింది. గతంలో ఈ గడువు 36 గంటలు ఉండేది. లోక్‌సభలో కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద ఈ వివరాలు వెల్లడించారు. డీప్‌ఫేక్‌లు, ఏఐతో రూపొందించిన తప్పుడు సమాచారం పెరుగుతున్న నేపథ్యంలో ఐటీ నిబంధనలను బలోపేతం చేసినట్లు చెప్పారు.నగ్న చిత్రాలు, వ్యక్తుల వేషధారణను అనుకరించడం, అశ్లీల కంటెంట్ వంటి సున్నితమైన అంశాలపై వచ్చే ఫిర్యాదులను ఇకపై రెండు గంటల్లోనే పరిష్కరించాలని స్పష్టం చేశారు. గతంలో ఇందుకు 24 గంటల గడువు ఉండేది.ఏఐతో రూపొందించిన కంటెంట్‌కు స్పష్టమైన గుర్తింపు, సోర్స్ వివరాలు తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సోషల్ మీడియా వేదికలను కేంద్రం ఆదేశించింది. దీంతో వినియోగదారులు అది నిజమైనదా, కృత్రిమంగా రూపొందించిందా అనేది సులభంగా గుర్తించే అవకాశం ఉంటుంది.చట్టాలను ఉల్లంఘించే డీప్‌ఫేక్ కంటెంట్ తయారీ, ప్రచారాన్ని అడ్డుకునేందుకు ఆటోమేటెడ్ సాంకేతిక వ్యవస్థలను వినియోగించాలని కూడా సూచించింది. బాలల లైంగిక దోపిడీ, అనుమతి లేకుండా వ్యక్తిగత చిత్రాల ప్రచారం, వేషధారణ మోసాల వంటి కంటెంట్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది.డీప్‌ఫేక్‌లను గుర్తించేందుకు ఐఐటీ జోధ్‌పూర్, ఐఐటీ మద్రాస్, ఐఐటీ ఖరగ్‌పూర్ అభివృద్ధి చేసిన ప్రత్యేక వ్యవస్థలను కూడా కేంద్రం ప్రస్తావించింది. అలాగే ఫిర్యాదుల పరిష్కారం కోసం గ్రీవెన్స్ అధికారుల నియామకం, కేంద్ర స్థాయిలో అప్పీల్ వ్యవస్థ, 'సహయోగ్' పోర్టల్‌ను కూడా అందుబాటులో ఉంచినట్లు తెలిపింది.

# చేనేతలకు సీఎం చంద్రబాబు కానుక.. ఒక్కో కుటుంబానికి రూ.25 వేల ఆర్థిక సాయం

ఆంధ్రప్రదేశ్‌లో చేనేత కార్మికుల సంక్షేమానికి, వారి వృత్తిని పరిరక్షించేందుకు ప్రజా ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. చేనేత కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునే లక్ష్యంతో 'నేతన్న సేవలో' అనే సరికొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. 12వ జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 7వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బాపట్ల జిల్లా చీరాలలో ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ పథకం కింద రాష్ట్రంలోని అర్హులైన ప్రతి చేనేత కుటుంబానికి రూ.25,000 చొప్పున ఆర్థిక సాయం అందనుంది. దీని ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 71,536 చేనేత కుటుంబాలకు మొత్తం రూ.179 కోట్లు జమ కానున్నాయి. ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇవ్వనప్పటికీ, చేనేత వృత్తిని, దాని వారసత్వాన్ని కాపాడాలనే సంకల్పంతో ప్రభుత్వం ఈ బృహత్తర పథకాన్ని అమలు చేస్తోంది.ఈ కొత్త పథకంతో పాటు ఇప్పటికే ప్రభుత్వం చేనేత రంగానికి అనేక విధాలుగా మద్దతు అందిస్తోంది. చేనేత కుటుంబాలకు నెలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్‌లకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తోంది. దీనివల్ల 62,541 చేనేత కుటుంబాలు, 10,032 పవర్‌లూమ్ యూనిట్లకు ప్రయోజనం చేకూరుతోంది. ఇందుకోసం ప్రభుత్వం ఏటా రూ.150 కోట్లు వెచ్చిస్తోంది. అంతేకాకుండా, చేనేతల వృద్ధాప్య పింఛన్ వయసును 50 ఏళ్లకు తగ్గించి, రాష్ట్రవ్యాప్తంగా 85 వేల మందికి నెలకు రూ.4,000 చొప్పున పింఛన్ అందిస్తోంది. ఈ పింఛన్ల కోసం ఏటా రూ.420 కోట్లు ఖర్చు చేస్తోంది. చేనేత కార్మికులకు ప్రభుత్వం అందిస్తున్న ఈ భరోసా వారి జీవనోపాధికి అండగా నిలుస్తోంది.చేనేత రంగాన్ని మౌలికంగా బలోపేతం చేసేందుకు కూడా ప్రభుత్వం దీర్ఘకాలిక చర్యలు చేపట్టింది. రాష్ట్రంలోని 109 ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు క్యాష్ క్రెడిట్ రూపంలో రూ.79 కోట్లు అందించింది. ఉప్పాడలో ప్రత్యేక మౌలిక సదుపాయాల ప్రాజెక్టు, మంగళగిరిలో హ్యాండ్లూమ్ పార్కు, రాజధాని అమరావతిలోని శాఖమూరులో చేనేత, హస్తకళల మ్యూజియం ఏర్పాటుకు కూడా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. భవిష్యత్తులో విశాఖపట్నంలో రూ.4,200 కోట్ల భారీ పెట్టుబడితో సుస్థిర టెక్స్‌టైల్ రీసైక్లింగ్ యూనిట్ ఏర్పాటు కానుండటం ఈ రంగ అభివృద్ధికి మరింత ఊతమివ్వనుంది.

**ముఖ్యమంత్రి పర్యటన వివరాలు**

ఈ పథకం ప్రారంభోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు రేపు చీరాలలో పర్యటించనున్నారు. ఉదయం 10:30 గంటలకు తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి బయలుదేరి, వేటపాలెం మండలం
కొత్తపేటకు చేరుకుంటారు. ఉదయం 11:05 గంటలకు అక్కడ ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభలో పాల్గొని ప్రసంగిస్తారు. అనంతరం మధ్యాహ్నం 1:35 గంటలకు జాండ్రపేటలో ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌లో నేతన్నలతో ముఖాముఖి నిర్వహిస్తారు. సాయంత్రం 4:10 గంటలకు కొత్తపేటలో టీడీపీ శ్రేణులతో సమీక్షా సమావేశంలో పాల్గొని, తిరిగి క్యాంపు కార్యాలయానికి చేరుకుంటారు.

## పరామర్శల పేరుతో బలప్రదర్శన ఎందుకు?

వైఎస్ఆర్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరామర్శల పేరిట బలప్రదర్శన చేస్తున్నారని ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత విమర్శించారు. ఆయన బయట అడుగు పెడితే విధ్వంసం, అరాచకాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఇలాంటి చర్యలతో ప్రజలకు ఏం సందేశం ఇస్తున్నారని ప్రశ్నించారు.రాష్ట్ర సచివాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో అనిత మాట్లాడారు. బాధితులను కాకుండా నిందితులను పరామర్శించడం ఏంటని జగన్‌ను నిలదీశారు. ఆయన పర్యటనల్లో చోటుచేసుకున్న ఘటనలకు సంబంధించిన వీడియోలను మీడియాకు ప్రదర్శించారు."వైకాపా నేతలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. బెట్టింగ్‌లో నష్టపోయి మృతి చెందిన వ్యక్తి విగ్రహావిష్కరణకు జగన్ వెళ్లారు. ఆయన కారు కింద ఓ వ్యక్తి పడినా పట్టించుకోకుండా వెళ్లిపోయారు.

అంబులెన్స్‌కు దారి ఇవ్వకుండా వైకాపా కార్యకర్తలు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. పరామర్శల సమయంలో మహిళలపై కూడా దాడులు జరుగుతున్నాయి. పోలీసులను బ్లాక్‌మెయిల్ చేసే ప్రయత్నాలు చేస్తున్నారు" అని ఆరోపించారు.పరామర్శల పేరుతో నిర్వహిస్తున్న బలప్రదర్శనల వల్ల ఇప్పటికే ముగ్గురు ప్రాణాలు కోల్పోయారని అనిత అన్నారు. ప్రజలకు ఉపయోగపడే ఒక్క మంచి పని అయినా జరిగిందా అని జగన్‌ను ప్రశ్నించారు.

## బొండా ఉమా రౌడీలను పోగేసి దాడికి పాల్పడ్డారు

- మొదటి పేజి తరువాయి

వంటి రౌడీలను ప్రోత్సహిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ శునకానందం పొందుతున్నారని, అయితే ఈ ఆనందం ఎంతో కాలం నిలవదని పేర్ని నాని మండిపడ్డారు. శిశుపాలుడి పాపాలు పండినట్లే చంద్రబాబు ప్రభుత్వ పాపాలను కూడా ప్రజలు లెక్కిస్తున్నారని, కూటమి ప్రభుత్వానికి నూకలు చెల్లే రోజులు దగ్గరపడ్డాయని హెచ్చరించారు. "చంద్రబాబును ఏమైనా అంటే ఇళ్లకు వచ్చి కొడతామని బెదిరిస్తున్నారు. మీ చేతనైంది చేసుకోండి, ఎంతమందిని కొడతారో మేమూ చూస్తాం" అంటూ సవాల్ విసిరారు.

## పోలవరం-బనకచర్లకు కేంద్రం బ్రేక్.. ఏపీ ప్రతిపాదన వెనక్కి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రతిపాదించిన పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం షాక్ ఇచ్చింది. ప్రాజెక్టుకు సంబంధించిన పర్యావరణ అనుమతుల ప్రతిపాదనను కేంద్ర పర్యావరణ, అడవులు, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ వెనక్కి పంపింది. ఈ విషయాన్ని కేంద్ర పర్యావరణ శాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్ లిఖితపూర్వకంగా రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేశారు.

కేంద్ర పర్యావరణ శాఖలోని ఎన్విరాన్‌మెంట్ అసెస్‌మెంట్ కమిటీ (ఈఏసీ) నివేదికల ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. 1980 గోదావరి జల వివాదాల ట్రిబ్యునల్ తీర్పుకు ఈ ప్రాజెక్టు రూపకల్పన, నీటి వినియోగ ప్రతిపాదనలు విరుద్ధంగా ఉన్నాయనే అభ్యంతరాలు వచ్చినట్లు వెల్లడించారు. అలాగే తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ప్రయోజనాలపై ప్రభావం పడే అవకాశం ఉందనే అంశాన్ని కూడా ఈఏసీ పరిగణనలోకి తీసుకుంది.ప్రాజెక్టుకు ముందు కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ద్వారా వరద జలాల లభ్యతపై సమగ్ర అధ్యయనం చేయించాలని కేంద్రం సూచించింది. అంతర్రాష్ట్ర
వివాదాలు పరిష్కరించిన తర్వాతే పర్యావరణ అనుమతుల కోసం మళ్లీ దరఖాస్తు చేయాలని స్పష్టం చేసింది.

రూ.81,900 కోట్ల అంచనా వ్యయంతో రూపొందించిన ఈ ప్రాజెక్టు ద్వారా గోదావరి నుంచి 200 టీఎంసీల వరద జలాలను రాయలసీమకు తరలించాలని ఏపీ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. దీనివల్ల సుమారు 80 లక్షల మందికి తాగునీరు, 3 లక్షల హెక్టార్లకు సాగునీరు అందుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. అయితే కేంద్రం తొలి దశలోనే ప్రతిపాదనను వెనక్కి పంపడంతో ప్రాజెక్టు ముందడుగు తాత్కాలికంగా నిలిచిపోయింది.

## చంద్రబాబు, లోకేశ్ జోలికొస్తే తోలు తీస్తాం

- మొదటి పేజి తరువాయి

తెలపాలనుకుంటే ధర్నా చౌక్‌లో చేసుకోవాలి. అంతేకానీ రోడ్డుపై కూర్చుని మా నాయకులపై దాడి చేస్తామంటే చూస్తూ ఊరుకోం. తోలుతీస్తాం. వెల్లంపల్లి శ్రీనివాస్ ఎక్కడ కనిపిస్తే అక్కడ కట్టేస్తాం" అని హెచ్చరించారు. ఇష్టమొచ్చినట్లు ప్రవర్తిస్తే ఇకపై సహించేది లేదని, ప్రతిఘటన తప్పదని ఘాటు వ్యాఖ్యలు చేశారు.

## డేటా సెంటర్ల హబ్‌గా హైదరాబాద్.. విశాఖపై ప్రపంచ దిగ్గజాల చూపు

భారత్ డేటా సెంటర్ రంగంలో వేగంగా దూసుకెళ్తోంది. ఇప్పటికే హైదరాబాద్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న డేటా సెంటర్ కేంద్రాల్లో ఒకటిగా నిలిచింది. విశాఖపట్నం భారీ స్థాయి కొత్త డేటా సెంటర్ ప్రాజెక్టులకు ఆకర్షణీయ గమ్యంగా మారుతోంది. ఈ విషయాలు నైట్ ఫ్రాంక్ విడుదల చేసిన తాజా నివేదికలో వెల్లడయ్యాయి.ప్రపంచంలోని 36 ప్రధాన డేటా సెంటర్ మార్కెట్లపై నిర్వహించిన అధ్యయనంలో ముంబయి ఆపరేషనల్ సామర్థ్యం పరంగా 15వ స్థానంలో నిలిచింది. అభివృద్ధి దశలో ఉన్న ప్రాజెక్టుల జాబితాలో 11వ స్థానాన్ని దక్కించుకుంది. హైదరాబాద్ ప్రస్తుతం 151 మెగావాట్ల సామర్థ్యంతో 27వ స్థానంలో ఉన్నా, 2.2 గిగావాట్లకు పైగా అభివృద్ధి ప్రణాళికలతో 19వ స్థానంలో నిలిచి వేగంగా విస్తరిస్తున్న కేంద్రంగా గుర్తింపు పొందింది.చెన్నై ఆగ్నేయాసియా ఇంటర్నెట్ ట్రాఫిక్‌కు కీలక కేంద్రంగా బలపడుతుండగా, బెంగళూరు గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు, పరిశోధన సంస్థల పెట్టుబడులను ఆకర్షిస్తోంది.మరోవైపు పూణె, ఢిల్లీ ఎన్‌సీటీ ప్రాంతంలో కూడా డేటా సెంటర్ల సామర్థ్యం పెరుగుతోంది. రెండో శ్రేణి నగరాల్లో విశాఖపట్నం, జామ్‌నగర్ భారీ గ్రీన్‌ఫీల్డ్ డేటా సెంటర్ ప్రాజెక్టులకు పెట్టుబడులను ఆకర్షిస్తున్నాయని నివేదిక పేర్కొంది. ప్రభుత్వ ప్రోత్సాహక విధానాలు, సముద్రగర్భ కేబుల్ కనెక్టివిటీ ప్రణాళికలు ఇందుకు దోహదపడుతున్నాయని వెల్లడించింది.క్లౌడ్ సేవల వినియోగం పెరగడం, కృత్రిమ మేధ వినియోగం విస్తరించడం, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వేగంగా ఎదగడం వల్ల భారత్‌లో డేటా సెంటర్లకు డిమాండ్ మరింత పెరుగుతోందని నైట్ ఫ్రాంక్ ఇండియా అభిప్రాయపడింది. విద్యుత్ సరఫరా, మౌలిక వసతుల విస్తరణ, వేగవంతమైన అనుమతులు ఉంటే రానున్న దశాబ్దంలో భారత్ ప్రపంచంలోనే కీలక డేటా సెంటర్ల కేంద్రంగా ఎదిగే అవకాశముందని పేర్కొంది.

## హైదరాబాద్ వాసులకు చల్లని కబురు.. శనివారం వరకు వర్షాలు

హైదరాబాద్‌వాసులకు భారత వాతావరణ శాఖ ఊరటనిచ్చే వార్త అందించింది. శనివారం వరకు హైదరాబాద్ సహా పరిసర ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన ఈదురుగాలులు వీస్తూ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ వర్షాలతో నగరంలో ప్రస్తుతం నెలకొన్న వర్షపాతం లోటు తగ్గుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.ప్రస్తుత నైరుతి రుతుపవనాల సీజన్‌లో ఇప్పటివరకు హైదరాబాద్‌లో సాధారణంగా 313.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉంది. కానీ, కేవలం 277.3 మి.మీ. మేర మాత్రమే కురిసింది. దీనివల్ల సుమారు 12 శాతం వర్షపాతం లోటు ఏర్పడింది. రాబోయే వర్షాలతో ఈ లోటు భర్తీ కావడంతో పాటు, రాష్ట్రంలోని జలాశయాల నీటి మట్టాలు కూడా పెరుగుతాయని భావిస్తున్నారు.తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రణాళిక సొసైటీ గణాంకాల ప్రకారం, రాష్ట్రవ్యాప్తంగా వర్షపాతం దాదాపు సాధారణ స్థితిలోనే ఉంది. రాష్ట్రంలో సాధారణ వర్షపాతం 402.1 మి.మీ. కాగా, ఇప్పటివరకు 379 మి.మీ. నమోదైంది. ముఖ్యంగా కామారెడ్డి జిల్లాలో అత్యధికంగా 581 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఇక్కడ సాధారణ వర్షపాతం 442.6 మి.మీ. మాత్రమే. మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లోనూ సాధారణం కంటే ఎక్కువ వర్షాలు కురిశాయి.రానున్న రోజుల్లో తెలంగాణలోని అన్ని జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తన తాజా బులెటిన్‌లో పేర్కొంది. వర్షం కురిసే సమయంలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీయవచ్చని అధికారులు అంచనా వేశారు.

## యూపీఐపై ఛార్జీలకు లోక్‌సభ గ్రీన్ సిగ్నల్..

- మొదటి పేజి తరువాయి

యూపీఐ సహా కొన్ని డిజిటల్ చెల్లింపులపై బ్యాంకులు, చెల్లింపు సేవల సంస్థలు మర్చంట్ డిస్కౌంట్ రేటు (ఎండీఆర్) వసూలు చేయకుండా చట్టపరమైన నిబంధన ఉంది. తాజా సవరణతో ఆ నిబంధన తొలగనుంది. దీంతో భవిష్యత్‌లో బ్యాంకులు, ఫిన్‌టెక్ సంస్థలు యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు విధించే అవకాశం ఏర్పడింది.ప్రస్తుతం ఆర్‌టీజీఎస్, నెఫ్ట్ లావాదేవీలపై సేవా రుసుములు అమల్లో ఉండగా, యూపీఐకి మాత్రం మినహాయింపు ఉంది. కొత్త బిల్లుతో ఆ పరిస్థితి మారనుంది.అయితే ఈ ఛార్జీలు సాధారణ వినియోగదారులపై కాదు. నిర్దిష్ట పరిమితికి మించిన యూపీఐ లావాదేవీలు చేసే పెద్ద వ్యాపారులు, వ్యాపార సంస్థలకే వర్తించే అవకాశం ఉందని సమాచారం. డిజిటల్ చెల్లింపు వ్యవస్థను నిర్వహిస్తున్న బ్యాంకులు, చెల్లింపు సేవల సంస్థలు, మౌలిక సదుపాయాల సంస్థలకు ఆదాయం సమకూర్చడమే ఈ మార్పుల ప్రధాన ఉద్దేశంగా తెలుస్తోంది.
ఛార్జీల శాతం, ఏ స్థాయి లావాదేవీలకు వర్తిస్తాయనే అంశాలపై కేంద్ర ప్రభుత్వం, నియంత్రణ సంస్థలు తర్వాత స్పష్టత ఇవ్వనున్నాయి.

## రైతుల కోసం కేంద్రం రూ.23,731 కోట్ల 'గోబర్ధన్' పథకం

వ్యవసాయ అవశేషాలు, పశువుల వ్యర్థాలతో అదనపు ఆదాయం పొందేలా రైతులకు కేంద్ర ప్రభుత్వం మరో కీలక అవకాశం కల్పించింది. బయోగ్యాస్ రంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా రూ.23,731 కోట్ల వ్యయంతో 'గోబర్ధన్' జాతీయ సర్క్యులర్ బయోఎనర్జీ పథకానికి కేంద్ర క్యాబినెట్ గురువారం ఆమోదం తెలిపింది.2026-27 నుంచి 2035-36 వరకు ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. దేశీయంగా 'కంప్రెస్డ్ బయోగ్యాస్' (సీబీజీ) ఉత్పత్తిని దాదాపు పది రెట్లు పెంచడమే ప్రధాన లక్ష్యంగా కేంద్రం నిర్ణయించింది. రైతుల నుంచి సేకరించే పశువుల పేడ, వ్యవసాయ వ్యర్థాలకు డిమాండ్ పెరగడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు కూడా విస్తరించనున్నాయి.సీబీజీ ఉత్పత్తిదారులకు స్థిరమైన మార్కెట్ కల్పించేందుకు ప్రత్యేక కొనుగోలు విధానాన్ని కేంద్రం తీసుకొచ్చింది. అలాగే సీబీజీకి ప్రతి ఎంఎంబీటీయూకు రూ.2,110 చొప్పున ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయించింది. దీనివల్ల ఉత్పత్తిదారులకు దీర్ఘకాలిక ఆదాయ భరోసా లభించనుంది.

కొత్తగా ఏర్పాటు చేసే సీబీజీ ప్లాంట్లకు రోజుకు ఒక టన్ను ఉత్పత్తి సామర్థ్యానికి గరిష్ఠంగా రూ.2 కోట్ల వరకు మూలధన సాయం అందించనున్నారు. ఇప్పటికే ఉన్న ప్లాంట్ల విస్తరణకు కూడా ఈ సాయం వర్తిస్తుంది. ముడి పదార్థాల సేకరణ, సేంద్రియ ఎరువుల తయారీ, విలువ ఆధారిత ఉత్పత్తుల అభివృద్ధికి కూడా ప్రోత్సాహం లభించనుంది.సీబీజీ ప్లాంట్లను గ్యాస్ పైప్‌లైన్లతో అనుసంధానించేందుకు అవసరమైన మౌలిక వసతులకు మద్దతు ఇవ్వనున్నారు. ఎంఎస్‌ఎంఈ ఆధారిత ప్రాజెక్టులకు రుణ హామీ పథకం కూడా అమలు చేయనున్నారు. దీంతో పెట్టుబడులు పెరిగి గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతం లభిస్తుందని కేంద్రం భావిస్తోంది.

## ఎన్నికలకు సిద్ధంకండి..

- మొదటి పేజి తరువాయి

అనుకున్న సమయానికే జరుగుతుందని స్పష్టం చేసిన లోకేశ్, కూటమి అభ్యర్థుల భారీ విజయానికి పక్కా ప్రణాళికతో క్షేత్రస్థాయికి వెళ్లాలని పిలుపునిచ్చారు. ప్రచారంలో భాగంగా నాయకులు ప్రతి ఇంటి వద్ద కనీసం 3 నిమిషాలైనా గడిపి, వైసీపీ ప్రభుత్వ విధ్వంసాన్ని, కూటమి ప్రభుత్వం తెచ్చిన సంక్షేమాన్ని క్షుణ్ణంగా వివరించాలని స్పష్టం చేశారు. ఈ ఉదయం మంత్రులతో నిర్వహించిన బ్రేక్ ఫాస్ట్ సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఈ మేరకు సూచించారు.ఇదే సమావేశంలో అసెంబ్లీ వ్యూహంపైనా చర్చించారు. రాష్ట్రంలో ఉన్న ఎల్-నినో పరిస్థితులపై అసెంబ్లీ వేదికగా ప్రజలకు స్పష్టత ఇవ్వాలని సూచించారు. జలాశయాల్లోకి నీరు చేరుతుండటం కొంత ఊరటనిచ్చినప్పటికీ... ప్రభుత్వం వైపు నుంచి తొలి ప్రాధాన్యత తాగునీటి సరఫరాకే ఇవ్వాలని, ఆ తర్వాత పశుగ్రాస కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి శాసనసభను సరైన వేదికగా మలుచుకోవాలని మంత్రులకు పిలుపునిచ్చారు.

## కొత్త ఉద్యమానికి కాక్రోచ్ పార్టీ శ్రీకారం.. దేశవ్యాప్తంగా 'క్యా బోల్తీ పబ్లిక్?'

- మొదటి పేజి తరువాయి

పేరుతో దేశవ్యాప్త ప్రచార కార్యక్రమం చేపడుతున్నట్లు పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దిప్కే ప్రకటించారు.ఛత్రపతి శంభాజీనగర్‌లో జరిగిన రెండు రోజుల జాతీయ కోర్ కమిటీ సమావేశం ముగిసిన తర్వాత దిప్కే మీడియాతో మాట్లాడారు. విద్యార్థులు, యువత, సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకొని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని చెప్పారు.దేశంలో విద్య పూర్తిగా వ్యాపారంగా మారిందని దిప్కే విమర్శించారు. మొదటి తరగతి ప్రవేశానికే రూ.లక్షల ఫీజులు, భారీ విరాళాలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. మధ్యతరగతి, ఉద్యోగ కుటుంబాలు పిల్లలను చదివించడం భారంగా మారిందన్నారు. ఉన్నత విద్య, కోచింగ్ పేరుతో తల్లిదండ్రులు అప్పుల పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. విద్య ప్రతి ఒక్కరి హక్కని, అది అందరికీ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.నీట్ అక్రమాలపై జరిగిన ఆందోళనల్లో నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారని దిప్కే గుర్తుచేశారు. దేశంలో నిరుద్యోగం కూడా అత్యంత కీలక సమస్యగా మారిందన్నారు. న్యాయవ్యవస్థ, ఎన్నికల సంఘంపై ప్రజల్లో విశ్వాసం దెబ్బతింటోందని వ్యాఖ్యానించారు. అధికారాన్ని ప్రశ్నించే స్వతంత్ర పాత్రను మీడియా పోషించాలని కోరారు.సీజేపీ ఎన్నికల్లో పోటీ చేయదని, ప్రజల హక్కుల పరిరక్షణ, పాలనలో సంస్కరణల కోసం ఒత్తిడి తెచ్చే శక్తిగా పనిచేస్తుందని దిప్కే స్పష్టం చేశారు.

## జగ్గంపేటలో వైసీపీ నాయకుల ఏపీ జెన్ జడ్ వార్ రిలే నిరాహార దీక్షలు



**జగ్గంపేట, పెన్ పవర్, ఆగస్టు 6:** జగ్గంపేట టౌన్ లోని వైఎస్సార్ విగ్రహం వద్ద ఏపీ మాజీ సీఎం జగన్ ఆదేశాల మేరకు జగ్గంపేట వైసీపీ ఇన్చార్జి తోట నరసింహం, రాష్ట్ర వైసీపీ విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ తోట శ్రీరాంజీ ఆధ్వర్యంలో డీఎస్సీ అవకతవకలపై గురువారం ఏపీ జెన్ జడ్ వార్ రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. తొలుత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీఎస్సీ విషయంలో జరిగిన అవకతవకలపై మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలంటూ డిమాండ్ చేశారు. మొదటి రోజు నిరాహార దీక్ష చేసిన వారికి మాజీమంత్రి తోట నరసింహం నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపచేశారు. కార్యక్రమంలో వైసీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## జొన్నాడ సర్వీస్ రోడ్డు పనులు పరిశీలించిన ఎమ్మెల్యే బండారు



**ఆలమూరు, పెన్ పవర్, ఆగస్టు 06;**ఏళ్ల తరబడి ఎంతో మంది ప్రాణాలు తీసిన,గాయాలతో మిగిల్చిన ఆలమూరు మండలం జొన్నాడ ఫ్లైఓవర్ వద్ద సర్వీస్ రోడ్డు పనులు చివర దశకు వచ్చాయి. గురువారం ఆ పనులను కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పరిశీలించారు.పనుల నాణ్యత, వేగంపై ఆరా తీసిన ఆయన వాహనదారులకు,ప్రజలకు ఇబ్బందులు లేకుండా త్వరితగతిన ఫ్లై ఓవర్ పనులు కూడా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం జాతీయ రహదారి అధికారులతో ఫోన్లో మాట్లాడి మరమ్మతులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టడంతో పాటు ప్రయాణికుల భద్రతకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ఫ్లై ఓవర్ నిర్మించే కాంట్రాక్ట్ సంస్థ ఆర్థిక ఇబ్బందులు ఉండడంతో తీవ్ర జాప్యం జరిగిందన్నారు. ఇక్కడ ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని దీంతో అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్ సహకారంతో ఈ సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. చివరకు ఆ కాంట్రాక్ట్ సంస్థను తప్పించి కొత్తగా మరికొన్ని ఒప్పందాలతో వేరే సంస్థకు అప్పగించారన్నారు. ఫ్లైఓవర్ నిర్మాణం మాట ఎలా ఉన్నా తక్షణమే సర్వీస్ రోడ్లు నిర్మించాలని పట్టు పట్టడంతో ఇవి పూర్తవుతున్నాయన్నారు. ఇప్పుడు వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని ఎమ్మెల్యే బండారు స్పష్టం చేశారు.ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయని కలెక్టర్ మహేష్ కుమార్ ప్రత్యేక శ్రద్ధతో నేషనల్ అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ పనులను వేగవంతం చేస్తున్నారని ఎంపి హరీష్ మాధూర్ కూడా పట్టువదలని విక్రమార్కునిలా ఇక్కడ పనులు జరగడానికి కృషి చేసారని ఎమ్మెల్యే బండారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు ఈదల సత్తిబాబు, సలాది నాగేశ్వరరావు, జొన్నాడ కూటమి నాయకులు తాడి శ్రీనివాస్ రెడ్డి,గొడవర్తి బాబి,బావన శ్రీనివాస్,పట్టెం వీరబాబు, తదితరులు ఉన్నారు.

## కార్పోరేట్‌కు ధీటుగా జగ్గంపేట సీహెచ్‌సీ వైద్య సేవలు




**గండేపల్లి, పెన్ పవర్, ఆగస్టు 06**

ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో నెలకొన్న అభిప్రాయాన్ని మార్చేస్తూ జగ్గంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (30 పడకల ఆసుపత్రి) ఆదర్శ వైద్య సేవలు అందిస్తోంది. జగ్గంపేటకు ఆనుకుని గండేపల్లి మండలం జెడ్. రాగంపేట గ్రామపంచాయతీ పరిధిలో జాతీయ రహదారి-16 సమీపంలో నిర్మించిన ఈ నూతన ఆసుపత్రిని 2025 ఆగస్టు 7న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ప్రారంభించారు. అంతేకాకుండా జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రోగులు కూడా వచ్చే వారికి ఉచిత భోజన సదుపాయాన్ని కూడా కల్పించారు. అత్యాధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేసిన ఈ ఆసుపత్రి ప్రస్తుతం కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా వైద్య సేవలు అందిస్తూ ప్రజల విశ్వాసాన్ని చూరగొంటోంది.

ఆసుపత్రి సూపరింటెండెంట్, జనరల్ సర్జన్ డాక్టర్ ప్రణీత్ నేతృత్వంలో పేద, నిరుపేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఖరీదైన వైద్య సేవలను పూర్తిగా ఉచితంగా అందిస్తున్నారు. దీంతో జగ్గంపేట, గండేపల్లి మండలాలతో పాటు అంబేద్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన, తదితర ప్రాంతాల నుంచి కూడా రోగులు ఇక్కడికి తరలివస్తున్నారు. రోజురోజుకు ఓపీ సంఖ్య పెరుగుతుండటం ఆసుపత్రిపై ప్రజల్లో పెరుగుతున్న నమ్మకానికి నిదర్శనంగా నిలుస్తోంది.

ప్రైవేట్ ఆసుపత్రుల్లో మాత్రమే లభించే ఆధునిక చికిత్సలను ప్రభుత్వ ఆసుపత్రిలోనే అందుబాటులోకి తీసుకురావడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వైద్యులు రోగుల పట్ల ఆప్యాయతతో వ్యవహరిస్తూ నాణ్యమైన వైద్య సేవలు అందిస్తుండటంతో ప్రభుత్వ ఆసుపత్రిపై ప్రజల్లో విశ్వాసం మరింత బలపడుతోంది.





జనరల్ మెడిసిన్ వైద్యాధికారి డాక్టర్ నీలిమ అందిస్తున్న వైద్య సేవలపై కూడా రోగులు ప్రశంసలు కురిపిస్తున్నారు. రోగుల సమస్యలను ఓర్పుతో విని, అవసరమైన చికిత్స అందిస్తూ ఆమె విశేష ఆదరణ పొందుతున్నారు.ఇటీవల ఆసుపత్రిలో లాపరోస్కోపిక్ శస్త్రచికిత్సలు విజయవంతంగా ప్రారంభించడం మరో విశేషం. వారం రోజుల క్రితం ముగ్గురు రోగులకు లాపరోస్కోపీ ద్వారా శస్త్రచికిత్సలు నిర్వహించి, 24 గంటల్లోనే డిశ్చార్జ్ చేయడం వైద్య బృందం నైపుణ్యాన్ని చాటిచెప్పింది. దీంతో అధునాతన శస్త్రచికిత్సల కోసం ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన అవసరం తగ్గిందని రోగులు అభిప్రాయపడుతున్నారు.ఈ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో శిశు వైద్య సేవలు సహా పలు విభాగాల వైద్యులు అందుబాటులో ఉండటంతో ప్రజలకు సమగ్ర వైద్య సేవలు లభిస్తున్నాయి. అంతేకాకుండా సూపర్ రోగులను స్వయంగా పరిశీలించి సంబంధిత వైద్యులకు సలహాలు సూచనలు ఇవ్వడం కోసమెరుపుగా మారింది. అంతేకాకుండా స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పర్యవేక్షణ, స్థానికంగా సిహెచ్సికి ఏమి కావాలి అని తెలుసుకోవడం కావలసిన సామాగ్రిని వచ్చే విధంగా ప్రభుత్వానికి సూచించడం వాటిని రప్పించడం ప్రజలకు వైద్యం అందించడం ఆయనకున్న శ్రద్ధ తార్కానంగా నిలుస్తుంది. అయితే ఆర్థోపెడిక్ నిపుణుల సేవలను కూడా అందుబాటులోకి తీసుకువస్తే కాకినాడ, రాజమహేంద్రవరం వంటి నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే చికిత్స పొందే అవకాశం కలుగుతుందని ప్రజలు కోరుతున్నారు.మొత్తంగా జగ్గంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ప్రభుత్వ వైద్య రంగంలో నాణ్యమైన సేవలకు చిరునామాగా మారుతూ, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ ఆదర్శ ఆసుపత్రిగా గుర్తింపు పొందుతోంది. నేటికీ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నూతన భవనం ప్రారంభోత్సవం జరిగి సంవత్సరం కాలం అవుతుందని ఈ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ద్వారా నాటి నుండి నమ్మకాన్ని వైద్యాన్ని పొందుతున్నామని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## జక్కంపూడి రామ్మోహన్ రావు 73వ జయంతి వేడుకలు

**జగ్గంపేట, పెన్ పవర్, ఆగస్టు 6:** జగ్గంపేట మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు కార్యాలయంలో గురువారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జ్యోతుల రామస్వామి ఆధ్వర్యంలో స్వర్గీయ మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహన్ రావు 73వ జయంతి వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ముందుగా స్వర్గీయ జక్కంపూడి రామ్మోహన్ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కార్యకర్తలతో కలిసి కేక్ కటింగ్ చేశారు. జగ్గంపేట గ్రామ మాజీ ఉపసర్పంచ్ బండారు రాజా మాట్లాడుతూ ప్రజా నాయకులు స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి స్నేహితుడిగా, ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు తనదైన శైలిలో ప్రజలకు సేవా కార్యక్రమాలు చేస్తూ, మాజీ మంత్రిగా అనేక పదవులను చేసిన మహా నాయకుడిగా, పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్న నాయకుడు జక్కంపూడి రామ్మోహన్ రావు అన్నారు. ఆయన ఆశయాలను ప్రజా సేవా కార్యక్రమాలను నిరంతరం ప్రతి ఒక్కరు చేపట్టాలని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కంచి లక్ష్మణ్ దొర, నక్కిరెడ్డి నాగేశ్వరరావు, బోద్దిరెడ్ల చక్కరరావు తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## కాకినాడ జిల్లాలో వైద్య ఆరోగ్య రంగ మౌలిక వసతుల కల్పనే ప్రధాన ధ్యేయం




- ఆసుపత్రుల అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి
- కలెక్టర్ హరేంధిర ప్రసాద్

**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 6:** జిల్లాలోని సామాజిక ఆరోగ్య కేంద్రాలు , ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ సివిల్, వైద్య పరికరాల ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఏపీ వైద్య సేవల ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎంఎస్ఐడీసీ) ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏపీఎంఎస్ఐడీసీ ఇంజినీరింగ్ అధికారులు,జిల్లా కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్ (డీసీహెచ్ఎస్), వైద్యాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ మౌలిక వసతుల పురోగతిని కలెక్టర్ సమీక్షించారు.ఈ సందర్భంగా వివిధ ఆసుపత్రుల్లో జరుగుతున్న సివిల్ పనులు, నూతన భవనాల నిర్మాణాలు, కాంపౌండ్ వాల్స్, డ్రైనేజీ వ్యవస్థలు, సెప్టిక్ ట్యాంకులు, మార్చురీ భవనాల నిర్మాణ పనుల పురోగతిని సీహెచ్‌సీ, పీహెచ్‌సీ వారీగా పరిశీలించారు.కలెక్టర్ మాట్లాడుతూ, నాబార్డ్ నిధులను సమర్థవంతంగా వినియోగించి,పెండింగ్‌లో ఉన్న పనులకు సంబంధించి అంచనాలు సిద్ధం చేసి సమర్పించాలని అధికారులను ఆదేశించారు.జిల్లాలోని ఆరోగ్య కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనను మరింత బలోపేతం చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.నాబార్డ్ ఆర్థిక సహకారంతో ఎంపిక చేసిన నాలుగు సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని, పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడవద్దని స్పష్టం చేశారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో భవనాల మరమ్మతులు,విద్యుద్దీకరణ, తాగునీటి సౌకర్యం,ఇతర మౌలిక వసతుల కల్పనను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆసుపత్రి ప్రాంగణాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తూ డ్రైనేజీ వ్యవస్థలు, సెప్టిక్ ట్యాంకులు, కాంపౌండ్ వాల్స్ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.అలాగే ఆసుపత్రులకు అవసరమైన వైద్య పరికరాల సమకూర్పు, పెండింగ్‌లో ఉన్న మార్చురీ భవనాల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో అధికారులు నిరంతరం పర్యటిస్తూ పనుల పురోగతిని పర్యవేక్షించాలని, ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సూచించారు.ఈ సమావేశంలో ఏపీఎంఎస్ఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీహెచ్. రత్నరాజు,డిప్యూటీ ఇంజనీర్ ఎన్. చక్రవర్తి,జిల్లా కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్ డాక్టర్ మహేష్, సామాజిక ఆరోగ్య కేంద్రాలు,ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.



### తిరుమల వాడపల్లికి పోటెత్తిన భక్తజనం.. ......

## విశేష పూజలతో ఆధ్యాత్మిక శోభ

* స్వామివారి అన్నదానానికి విరాళం అందించిన భక్తులు





**ఆత్రేయపురం పెన్ పవర్ ఆగస్టు 6:**తిరుమల వాడపల్లి శ్రీ వెంకటేశ్వరస్వామి క్షేత్రం గురువారం భక్తులతో కిటకిటలాడింది. తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించి ఆధ్యాత్మిక అనుభూతిని పొందారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య స్వామివారికి విశిష్ట పూజలు, ప్రత్యేక అర్చనలు అత్యంత వైభవంగా నిర్వహించారు.

ఏడువారాల వెంకటేశ్వరస్వామి వ్రతాన్ని పూర్తి చేసిన భక్తులు ఆలయ సన్నిధిలో నిర్వహించిన అష్టోత్తర పూజలో భక్తిశ్రద్ధలతో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. ఆలయ ప్రాంగణం గోవింద నామస్మరణతో మార్మోగగా, భక్తులు స్వామివారి ప్రసాదాలను భక్తిపూర్వకంగా స్వీకరించారు.

ఆలయంలో ప్రతిరోజూ నిర్వహిస్తున్న నిత్య అన్నప్రసాద కార్యక్రమానికి భక్తులు ఉదారంగా విరాళాలు అందజేస్తున్నారు. ఈ సందర్భంగా విజయవాడ మహానగరానికి చెందిన యక్కల వీరేంద్ర సాయి మణికంఠ, శ్రీ సుప్రజ దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి రూ.1,01,116లను నిత్య అన్నప్రసాద సేవకు విరాళంగా అందించారు. దాతలను ఆలయ అర్చకులు వేదాశీర్వచనాలతో ఆశీర్వదించగా, ఆలయ సూపరింటెండెంట్ పులపర్తి రాంబాబు స్వామివారి చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు. భక్తుల సహకారంతో నిత్య అన్నప్రసాద సేవలు నిరంతరం కొనసాగుతున్నాయని ఆలయ అధికారులు తెలిపారు.

## ముర్రుపాలే శిశువుకు తొలి టీకా.. ....

తల్లిపాలపై అవగాహన పెంపొందించాలి



**ఆత్రేయపురం పెన్ పవర్ ఆగస్టు 6:**ఆత్రేయపురం మండలం లొల్ల--2 పీహెచ్ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో సూపర్‌వైజర్ కె. పద్మావతి తల్లిపాల ప్రాధాన్యంపై విస్తృతంగా వివరించారు.

పుట్టిన శిశువుకు తొలి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే అందించాలని, ఎలాంటి ఇతర ఆహార పదార్థాలు ఇవ్వకూడదని ఆమె సూచించారు. ప్రసవం జరిగిన గంటలోపే ముర్రుపాలు పట్టించడం వల్ల శిశువుకు వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని, ముర్రుపాలే శిశువుకు తొలి టీకా వంటివని తెలిపారు. అలాగే బాలింతలు సమతుల్య ఆహారం తీసుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా తల్లి, శిశువు ఆరోగ్యం మెరుగుపడుతుందని వివరించారు. ఈ సందర్భంగా ఏఎన్ఎం నాగలక్ష్మి మాట్లాడుతూ తల్లిపాల వల్ల శిశువుకు సంపూర్ణ పోషకాహారం లభించడంతో పాటు అంటువ్యాధుల నుంచి రక్షణ కలుగుతుందని చెప్పారు. తల్లిపాల ప్రాముఖ్యతను ప్రతి కుటుంబం గుర్తించి, శిశువుల ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు సహకరించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొని తల్లిపాల ప్రాధాన్యంపై అవగాహన పొందారు.

## అసిస్టెంట్ ప్రొఫెసర్ "పెయ్యల శ్రీదేవి"కు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ



**గండేపల్లి, పెన్ పవర్, ఆగస్టు 06:**గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ మేనేజ్మెంట్ స్టడీస్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్న"పెయ్యల శ్రీదేవి" ఆంధ్రా యూనివర్సిటీ విశాఖపట్నం నుంచి డాక్టరేట్ సాధించినట్లు ఆదిత్య యూనివర్సిటీ ప్రో.ఛాన్సలర్ డా. నల్లమిల్లి సతీష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రా యూనివర్సిటీ విశాఖపట్నం కి చెందిన ప్రొఫెసర్ ఎన్.కిషోర్ బాబు నేతృత్వంలో శ్రీదేవి సమర్పించిన "థీసిస్ శీర్షిక: " ఇంపాక్ట్ ఆఫ్ స్ట్రాటజిక్ హ్యూమన్ క్యాపిటల్ మేనేజ్మెంట్ ప్రాక్టీసెస్ ఆన్ ఆర్గనైజేషన్ ఎఫక్ టీవ్నెస్" అనే అంశంపై డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పొందారని తెలిపారు. "డా." పెయ్యల శ్రీదేవి" భవిష్యత్ లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆదిత్య అధినేత, యూనివర్సిటీ ఛాన్సలర్ డా. ఎన్. శేషారెడ్డి, శుభాకాంక్షలు తెలిపారు. డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ . డా.ఎం.శ్రీనివాస రెడ్డి, వైస్ ఛాన్సలర్. ప్రో. ఎం.బి. శ్రీనివాస్. ప్రో. వైస్ ఛాన్సలర్. డా. ఎస్. రమాశ్రీ, డా. ఆదిరెడ్డి రమేష్, డా. రవి తంగజన్, రిజిస్ట్రార్ డా జి.సురేష్, మరియు వివిధ విభాగాల విభాగాధిపతులు ఉపాధ్యాయ సిబ్బంది డా.పెయ్యల శ్రీదేవి కు అభినందనలు తెలియజేశారు.

# వాడపల్లి వెంకటేశ్వరస్వామి దర్శనానికి ఏపీటీడీసీ ప్రత్యేక తీర్థయాత్ర







**ఆత్రేయపురం పెన్ పవర్ ఆగస్టు 6:**వాడపల్లి శ్రీ వెంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లే భక్తులకు ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) శుభవార్త అందించింది. భక్తుల సౌకర్యార్థం విజయవాడ--వాడపల్లి మధ్య ప్రత్యేక వన్‌డే తీర్థయాత్ర ప్యాకేజీని ఈ నెల 8వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. ఈ ప్రత్యేక యాత్ర విజయవాడ సెంట్రల్ రిజర్వేషన్ కార్యాలయం నుంచి ఉదయం 4 గంటలకు బయలుదేరి, అదే రోజు సాయంత్రం 7 గంటలకు తిరిగి విజయవాడకు చేరుకుంటుంది.

ఈ ప్యాకేజీలో పెద్దలకు రూ.1,160, పిల్లలకు రూ.1,000గా ఛార్జీలు నిర్ణయించారు. సౌకర్యవంతమైన బస్సు ప్రయాణంతో పాటు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజన సదుపాయాన్ని కూడా ఏపీటీడీసీ కల్పిస్తోంది. అయితే ఆలయ దర్శనం టికెట్‌కు సంబంధించిన ఛార్జీలను భక్తులే ప్రత్యేకంగా చెల్లించాల్సి ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఏపీటీడీసీ జనరల్ మేనేజర్ టి.ఎస్.వి. నారాయణ మాట్లాడుతూ, తీర్థయాత్రలకు వెళ్లే భక్తులకు సమయం, ప్రయాణ ఇబ్బందులు తగ్గించే ఉద్దేశంతో ఈ ప్రత్యేక ప్యాకేజీని అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. భక్తులు ముందస్తుగా తమ సీట్లను బుక్ చేసుకోవాలని సూచించారు. ఇందుకోసం ఏపీటీడీసీ అధికారిక వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా లేదా విజయవాడ బందర్ రోడ్డులోని లెమన్ ట్రీ హోటల్ సమీపంలోని సెంట్రల్ రిజర్వేషన్ కార్యాలయంలో నేరుగా సంప్రదించి రిజర్వేషన్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ ప్రత్యేక తీర్థయాత్ర ప్యాకేజీ విజయవాడతో పాటు పరిసర ప్రాంతాల భక్తులకు వాడపల్లి క్షేత్ర దర్శనాన్ని మరింత సులభతరం చేయనుంది.

# మెగా రక్తదాన శిబిరం






**గండేపల్లి, పెన్ పవర్, ఆగస్ట్ 06:**గండేపల్లి మండలం ఆదిత్య యూనివర్సిటీ నందు ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరం విజయవంతం గా ముగిసినట్లు డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డా. మేడపాటి శ్రీనివాస రెడ్డి తెలియజేశారు. ఆదిత్య సిబ్బంది మరియు విద్యార్థుల సౌజన్యంతో నిర్వహించబడిన ఈ మెగా రక్తదాన శిబిరం ఉదయం 9-30 ని.లకుప్రో.ఛాన్సలర్ డా. నల్లమిల్లి సతీష్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా డా. ఎన్. సతీష్ రెడ్డి మాట్లాడుతూ ఆదిత్య సూరంపాలెం క్యాంపస్ నందు 2005 సంవత్సరం నుండి ప్రతీ సంవత్సరం జనవరి మరియు ఆగస్టు నెలలో ఈ మెగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి జిల్లాలో గల ప్రభుత్వ ఆస్పత్రులకు సంబంధించిన బ్లడ్ బ్యాంకు లకు మరియు ప్రముఖ ప్రైవేట్ బ్లడ్ బ్యాంక్ లకు అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో వివిధ సందర్భాలలో సంభవించిన ప్రమాదాలలో సరైన సమయానికి రక్తం అందని కారణంగా ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు ఈ విషయాన్ని అవగాహన చేసుకున్న ఆదిత్య సిబ్బంది విద్యార్థులు ప్రతీ సంవత్సరం ఈ మెగా రక్తదాన శిబిరంలో అధిక సంఖ్యలో విద్యార్థులు మరియు సిబ్బంది పాల్గొని అత్యధిక యూనిట్ల రక్తం ఇవ్వడమే కాకుండా అవసరమైన సందర్భాల్లో కూడా రక్త దానం చేయడం అభినందనీయం అని అన్నారు. ఇదే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ మరింత ఎక్కువ యూనిట్ల రక్తాన్ని ఆదిత్య సంస్థ ద్వారా అందించడానికి కృషి చేస్తామని డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డా.ఎం. శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ మెగా రక్తదాన శిబిరంలో కాకినాడ,రాజమహేంద్రవరం,రంపచోడవరం ప్రభుత్వ ఆసుపత్రికి సంబంధించిన బ్లడ్ బ్యాంక్ లతో పాటు సిదార్ధ,రోటరీ,ఇండియన్ రెడ్ క్రాస్ కాకినాడ వారు,విజయశ్రీ,డా. వై.ఎస్.ఆర్. జక్కంపూడి రామ్మోహనరావు,ధన్వంతరి రాజమహేంద్రి, యువసేన బ్లడ్ బ్యాంక్, అక్షయ బ్లడ్ బ్యాంక్, సత్య సూర్య బ్లడ్ బ్యాంక్, సహస్ర బ్లడ్ బ్యాంక్,ఏ.ఎస్.ఎన్.రాజు చారిటబుల్ ట్రస్ట్ బ్లడ్ బ్యాంక్' పెద్దాపురం కు చెందిన రోటరీ బ్లడ్ బ్యాంక్ పాల్గొన్న ఈ శిబిరంలో 911 యూనిట్ల రక్తం సేకరించారు. ఆ యా సంస్థలకు చెందిన డాక్టర్లు వారి సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎం.బి.శ్రీనివాస్, ప్రో.వైస్ ఛాన్సలర్ లు డా.ఆదిరెడ్డి రమేష్, డా. ఎస్.రమాశ్రీ, డా. తంగజం, డా.కె.రవిశంకర్,డా. డి. సతీష్ కుమార్, ఎస్.టి.వి.ఎస్.కుమార్, వివిధ విభాగాల డీన్స్, విభాగాధిపతులు, సిబ్బంది, ఎన్.ఎస్.ఎస్.కో.ఆర్డినేటర్ లు మరియు రెడ్ క్రాస్ లియో కో.ఆర్డినేటర్లు, వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఏలేరు ప్రాజెక్టులో లభ్యమైన యువకుడి మృతదేహం



**జగ్గంపేట, పెన్ పవర్, ఆగస్టు 6:** మండలంలోని బావారం గ్రామంలోని ఏలేరు ప్రాజెక్టులో బుధవారం గల్లంతైన వడ్డే ప్రశాంత్ కుమార్ మృతదేహం గురువారం లభ్యమైందని జగ్గంపేట ఎస్ఐ టి.రఘునాధరావు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగ్గంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించామన్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ రఘునాధరావు వివరించారు. దీనిపై కేసు నమోదు చేశామన్నారు.

# తల్లిపాలే బిడ్డకు శ్రేయస్సుకరం





**తల్లి పాలు వారోత్సవాల్లో సిడిపిఓ పూర్ణిమ**

**గండేపల్లి, పెన్ పవర్, ఆగస్టు 06:**తల్లిపాలే బిడ్డకు శ్రేయస్సుకరమని జగ్గంపేట ప్రాజెక్టు అధికారిని పూర్ణిమ అన్నారు. తల్లిపాలు వారోత్సవాలలో భాగంగా గురువారం మండల కేంద్రమైన గడ్డేపల్లి రామాలయం వద్ద తల్లిపాలు వారోత్సవాలు సూపర్వైజర్లు మున్నీసా, అమ్మాజీ ల ఆధ్వర్యంలో జరగకగా ముఖ్యఅతిథిగా ప్రాజెక్ట్ అధికారిని పూర్ణిమ ఇచ్చేశారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ "తల్లి పాలు -- శిశువుకు తొలి టీకా, సంపూర్ణ ఆహారం" అని ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొంది అని తెలియజేశారు.

శిశువు పుట్టిన వెంటనే మొదటి గంటలోనే తల్లి పాలు ఇవ్వాలి. మొదట వచ్చే పసుపు రంగు పాలు (కొలస్ట్రం) శిశువుకు అమూల్యమైన రక్షణ కవచం. ఇవి శిశువులో రోగనిరోధక శక్తిని పెంచి అనేక వ్యాధుల నుండి కాపాడుతాయి అన్నారు.

శిశువు పుట్టిన తర్వాత మొదటి ఆరు నెలలు తల్లి పాలు మాత్రమే ఇవ్వాలని

ఆరు నెలల తర్వాత ఇంటి ఆహారంతో పాటు రెండు సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం తల్లి పాలను కొనసాగించడం మంచిదని తెలియజేశారు

తల్లి పాల వల్ల శిశువుకు

సంపూర్ణ పోషకాహారం అందుతుందన్నారు.

రోగనిరోధక శక్తి పెరుగుతుంది

మెదడు ఎదుగుదల మెరుగుపడుతుంది.

ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు బలమైన పునాది ఏర్పడుతుంది.

తల్లికి కూడా తల్లి పాల వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి అన్నారు.

ప్రసవానంతరం త్వరగా కోలుకోవడం, రక్తస్రావం తగ్గడం, రొమ్ము మరియు అండాశయ క్యాన్సర్ల ప్రమాదం తగ్గడం వంటి ప్రయోజనాలు లభిస్తాయి అని

కుటుంబ సభ్యులు కూడా తల్లికి అవసరమైన విశ్రాంతి, పోషకాహారం మరియు మానసిక ధైర్యాన్ని అందించాలి అన్నారు.

మనమందరం కలిసి ప్రతి శిశువుకు తల్లి పాల హక్కు అందేలా కృషి చేద్దాం . ఆరోగ్యవంతమైన పిల్లలు, ఆరోగ్యవంతమైన కుటుంబాలు ఉండేలా కృషి చేద్దాము అన్నారు.

ఈ సందర్భంగా ఆడపిల్ల పుట్టిన తల్లి తణుకు కీర్తి ఇంటి వద్ద మొక్కను నాటారు. గ్రామ టిడిపి నాయకులు, తెలుగుదేశం పార్టీ గ్రామ అధ్యక్షులు బొల్లంరెడ్డి రామ కృష దంపతులు ఆరుగురు మంది గర్భిణీ లకు శ్రీమంతం చేసారు .

ఈ కార్యక్రమం లో బొల్లంరెడ్డి రామ కృష్ణా గ్రామ టీడీపీ అధ్యక్షులు, పైల వెంకన్న రామాలయం చైర్మన్, చిటికెలా కన్నా బాబు కో క్లస్టర్ ఇంచార్జి పెనుగాడి నాగరాజు, నాలం వీరబాబు, డాక్టర్, ఏఎన్ఎం , మహిళా పోలీస్, వెల్ఫేర్ అసిస్టెంట్, సూపరవైజర్ కరీమున్నిసా, అమ్మాజీ అంగన్వాడీ టీచర్స్, ఆశ లు,తల్లులు పాల్గొన్నారు.

## కవల దూడలకు జన్మనిచ్చిన జెర్సీ ఆవు



**జగ్గంపేట, పెన్ పవర్, ఆగస్టు 6**: జగ్గంపేటకు చెందిన ఎస్వీఎస్ నాయుడు, సత్తి సదాశివారెడ్డి ఇంట్లోని ఒక జెర్సీ ఆవుకు రెండు దూడలు ఒకేసారి జన్మించాయి. అయితే రెండు దూడలు కూడా ఆడదూడలు కావడం విశేషం. రెండు దూడలు కూడా ఆరో గ్యంగా ఉన్నాయి. జెర్సీ ఆవుకు రెండు దూడలు ఒకేసారి పుట్టడంతో వాటిని చూసేందుకు స్థానికులు ఆసక్తి కనబరిచారు.

# ప్రపంచ తల్లిపాల వారోత్సవం: తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన

**కాకినాడ పెన్ పవర్, ఆగస్టు 6:** ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా బుధవారం పల్లిపేట సీహెచ్‌సీ లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నీలిమ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె. దయామణి తల్లిపాల ప్రాముఖ్యతపై లబ్ధిదారులకు వివరించారు.
పుట్టిన గంటలోపే శిశువుకు తల్లిపాలు ఇవ్వాలని, తొలి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే అందించాలని సూచించారు. తల్లిపాలలో వ్యాధి నిరోధక శక్తి ఉండటంతో అవి శిశువుకు తొలి టీకాతో సమానమని తెలిపారు. తల్లిపాలు తాగిన పిల్లల్లో మెదడు అభివృద్ధి మెరుగ్గా ఉండటంతో పాటు డయేరియా, జ్వరం వంటి వ్యాధులు వచ్చే అవకాశం తగ్గుతుందని పేర్కొన్నారు.
అలాగే బిడ్డకు పాలివ్వడం వల్ల తల్లికి రొమ్ము క్యాన్సర్ వంటి వ్యాధుల ముప్పు తగ్గుతుందని, తల్లి--బిడ్డల మధ్య ప్రేమాభిమానాలు మరింత బలపడతాయని వివరించారు. శిశువు కోరినప్పుడల్లా, కనీసం రెండు గంటలకు ఒకసారి తల్లిపాలు ఇవ్వాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో సంజయ్‌నగర్ యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నీలిమ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె. దయామణి, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, నర్సింగ్ విద్యార్థులు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.



02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ. వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యం



* 'రైతన్న మీ కోసం' కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలి
* కలెక్టర్ హరేంధిర ప్రసాద్

**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 6:** జిల్లాలో రైతు సేవా కేంద్రాల (ఆర్ఎస్‌కే) పరిధిలో ఏర్పాటైన కమిటీల ద్వారా 'రైతన్న మీ కోసం' కార్యక్రమాన్ని ఈ నెల 7వ తేదీ నుంచి సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు.
గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి వ్యవసాయం,ఉద్యానవనం, పశు సంవర్ధక,పట్టుపరిశ్రమ,ఏపీ ఎంఐపీ (బిందు, తుంపర్ల సేద్యం), మత్స్యశాఖల క్షేత్రస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్, వివిధ సంక్షేమ పథకాల అమలు, సాగునీటి సరఫరా,క్షేత్రస్థాయి పనితీరుపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 'రైతన్న మీ కోసం' కార్యక్రమంలో రైతు సేవా కేంద్రాల పరిధిలోని కమిటీలు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని సూచించారు.ప్రస్తుత ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా రైతుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు.
ఏలేరు ఆయకట్టు పరిధిలో తాగు, సాగునీటి అవసరాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వంతులవారీగా నీటి సరఫరా చేపట్టాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. సాగులో ఉన్న ప్రతి పంటకు ఈ-క్రాప్ నమోదు వందశాతం పూర్తి చేయడంతో పాటు, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద అర్హులైన రైతులందరూ లబ్ధి పొందేలా అవగాహన కల్పించాలని సూచించారు.వ్యవసాయ, ఉద్యాన రంగాల్లో డ్రిప్, స్ప్రింక్లర్ వంటి బిందు, తుంపర్ల సేద్య పరికరాలను రాయితీపై అందించాలని, పీఎండీఎస్ ద్వారా 20 రకాల విత్తన కిట్ల సరఫరాను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఉద్యానవనాల విస్తరణకు ప్రోత్సాహం అందించడంతో పాటు ప్రత్యేక యాప్ ద్వారా ఎరువుల సరఫరాలో పారదర్శకత పాటించాలని సూచించారు.రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, ప్రకృతి సహజ వ్యవసాయాన్ని విస్తృతంగా ప్రోత్సహించేందుకు రైతుల్లో చైతన్యం కల్పించాలని కలెక్టర్ పేర్కొన్నారు.పాల ఉత్పత్తి పెంపు కోసం చర్యలు తీసుకోవడంతో పాటు, పశువులకు సకాలంలో టీకాలు వేయడం, పశు దాణా సరఫరా, పశు బీమా పథకాన్ని అర్హులైన పాడి రైతులందరికీ వర్తింపజేయాలని అధికారులను ఆదేశించారు. మత్స్య శాఖలో సీడ్ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేసి, ప్రధానమంత్రి మత్స్య సంపద యోజనను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. భద్రతా చర్యల్లో భాగంగా మత్స్యకారుల పడవలకు తప్పనిసరిగా ట్రాన్స్‌పాండర్లు అమర్చే ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ప్రతి సంక్షేమ పథకం క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి రైతుకు చేరేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో జిల్లా మత్స్యశాఖ అధికారి వి. కృష్ణారావు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి మనోజ్ కుమార్, ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ వి.వి.వి. ప్రసాదరావు, జిల్లా ఉద్యాన అధికారి సిరులు, న్యాచురల్ ఫార్మింగ్ ఉపసంచాలకులు జే. ఎలియాజార్, జిల్లా సెరికల్చర్ అధికారి గీతారాణితో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఈనెల 7న జాతీయ చేనేత దినోత్సవం




* చేనేత కార్మికులు, సంఘాల ప్రతినిధులు పాల్గొనాలి
* కలెక్టర్ హరేంధిర ప్రసాద్

**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 6:** జాతీయ చేనేత దినోత్సవం--2026 వేడుకలను ఈనెల 7వ తేదీన జిల్లా చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో గొల్లప్రోలు మండలం తాటిపర్తిలోని గజ్జలమ్మ దేవాలయం వద్ద నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఉదయం 10.30 గంటలకు గజ్జలమ్మ దేవాలయం నుంచి చేనేత నడక (హ్యాండ్లూమ్ వాక్) ప్రారంభమై తాటిపర్తిలోని అపర్ణాదేవి ఆలయ ఆవరణం వరకు కొనసాగుతుందని తెలిపారు. అనంతరం అదే ప్రాంగణంలో జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.జిల్లాలోని చేనేత కార్మికులు, చేనేత సహకార సంఘాల అధ్యక్షులు,సంఘాల నాయకులు, చేనేత అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై జాతీయ చేనేత దినోత్సవం--2026 వేడుకలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోరారు.

## విద్యార్థులు ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి.

-విద్యామిత్ర కిట్ల పంపిణీ కార్యక్రమంలో ఎంపీపీ తోట రవి.





**కిర్లంపూడి,పెన్ పవర్, ఆగస్టు, 06:** ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కిర్లంపూడి ఎంపీపీ తోట రవి అన్నారు.
కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం వీరవరం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లను పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ తోట రవి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సూచనల మేరకు విద్యార్థినీ విద్యార్థులకు ఎంపీపీ తోట రవి చేతుల మీదుగా విద్యామిత్ర కిట్లను అందజేశారు.విద్యామిత్ర కిట్లలో భాగంగా పుస్తకాలు,పాఠశాల బ్యాగులు,యూనిఫామ్,షూస్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎంపీపీ తోట రవి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు,పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు.ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వీరవరం గ్రామ టీడీపీ పార్టీ ప్రెసిడెంట్ గొల్లపల్లి సూరిబాబు,జగ్గంపేట వ్యవసాయ కమిటీ డైరెక్టర్ పిడుగు జయబాబు,స్కూల్ విద్యా కమిటీ చైర్మన్ పెనమరెడ్డి వీర గణేష్,విద్యా కమిటీ కోఆర్డినేటర్ సభ్యులు పులి రంగ,స్కూల్ సిబ్బంది మరియు మరోతు రాము,ఐదవ వార్డ్ నెంబర్ దంటా వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ జయంతి రాష్ట్ర అధికారిక పండుగ





* కోరింగలో ఘనంగా నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి
* జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్

**కాకినాడ/తాళ్లరేవు, పెన్ పవర్,ఆగస్టు 6:** అగ్నికుల క్షత్రియ జాతిపిత, ప్రముఖ మత్స్యకార నాయకుడు పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారిక రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ తెలిపారు.ఈ నెల ఆగస్టు 7న పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ స్వగ్రామమైన తాళ్లరేవు మండలం కోరింగలోని బొడ్డు సత్యనారాయణ ఫంక్షన్ హాల్‌లో జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ వేడుకల ఏర్పాట్లను పరిశీలించి,వేదికతో పాటు ఇతర ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ, అగ్నికుల క్షత్రియ సమాజానికి పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ అందించిన విశిష్ట సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం,ప్రతి సంవత్సరం ఆగస్టు 7న ఆయన జయంతిని అధికారిక రాష్ట్ర పండుగగా నిర్వహించేలా ఉత్తర్వులు జారీ చేసిందన్నారు.రాష్ట్రంలో తొలిసారిగా ఆయన స్వగ్రామమైన కోరింగలో అధికారికంగా ఈ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు తెలిపారు.మత్స్యకార సోదరులు,అగ్నికుల క్షత్రియ ప్రజాప్రతినిధులు,సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ వెల్ఫేర్ కార్యనిర్వాహక సంచాలకులు ఎ.శ్రీనివాసరావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ర్యాలిలో ఇంటింటికీ కూటమి ప్రభుత్వ విజయాల ప్రచారం.. ...

ప్రజల నుంచి విశేష స్పందన





**ఆత్రేయపురం పెన్ పవర్ ఆగస్టు 6:**ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో గురువారం విస్తృత ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను వివరించే కరపత్రాలను పంపిణీ చేసి, పాలనలో సాధించిన ముఖ్య విజయాలను ప్రజలకు వివరించారు.
ఈ సందర్భంగా ర్యాలి గ్రామ మాజీ సర్పంచ్ పేర్చెర్ల పల్లమరాజు వర్మ మాట్లాడుతూ, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయాలు, సంక్షేమ పథకాలపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకే ఇంటింటి ప్రచారం చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వ పనితీరుపై ప్రజలు సానుకూలంగా స్పందిస్తూ అభినందనలు తెలియజేస్తున్నారని అన్నారు.
ఈ ప్రచార కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జ్ కందుల రాంబాబు, మండల ప్రధాన కార్యదర్శి గుడిని నాగేంద్ర గౌడ్, బూత్ ఇన్‌చార్జిలు అత్తిలి వెంకట్, దిడ్ల సురేష్, కొమ్మర చినబాబు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రజలను కలిశారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు ప్రతి ఇంటికీ చేరేలా ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని నాయకులు తెలిపారు.

## తల్లిపాలు శిశువుకు పరమౌషధం-సిడిపిఓ విజయశ్రీ





**అంబాజీపేట,పెన్ పవర్, ఆగస్టు 06:**తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారాన్ని అందించడమే కాకుండా, అనేక వ్యాధుల నుంచి రక్షించే సహజ రోగనిరోధక శక్తిని అందించే పరమౌషదమని ఐసిడిఎస్ పి గన్నవరం ప్రాజెక్టు సిడిపిఓ వై విజయశ్రీ అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా పండు వారి పేట అంగన్వాడీ కేంద్రంలో పిల్లల తల్లిదండ్రులు బాలింతలతో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. సూపర్వైజర్ వి ఎస్ వి మహాలక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో విజయశ్రీ మాట్లాడుతూ పిల్లలలో తరచూ వచ్చే విరేచనాలు, న్యుమోనియా వంటి వ్యాధుల ప్రమాదం నుండి కాపాడుతుందన్నారు. తల్లిపాల వలన తల్లి--శిశువు మధ్య భావోద్వేగ బంధం బలపడుతుందని పేర్కొన్నారు. అంబాజీపేట స్త్రీల ఆసుపత్రి చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ టి ప్రశాంతి మాట్లాడుతూ పుట్టిన మొదటి గంటలోనే తల్లిపాలు ప్రారంభించాలని తెలిపారు. మొదటి 6 నెలలు శిశువుకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని. 6 నెలల తర్వాత అనుబంధ ఆహారంతో పాటు 2 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం తల్లిపాలను కొనసాగించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ ప్రసాద్, ఏఎన్ఎం అల్లాడ హైమావతి అంగన్వాడి కార్యకర్త గుబ్బల వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటికి కార్యక్రమానికి విశేష స్పందన వస్తుంది





## అభివృద్ధి,సంక్షేమానికి ప్రజల ప్రశంసలు

### ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

**ఆలమూరు, పెన్ పవర్, ఆగస్టు 06;** ఇంటింటికి వెళ్లే కార్యక్రమానికి విశేష స్పందన వస్తుందని ఏ గ్రామం వెళ్ళినా అక్కడ అభివృద్ధి చూసి ప్రజలు ప్రశంస్తున్నారన్నారు. అలాగే పెరిగిన పింఛన్ల సొమ్ము, తల్లికి వందనం,అన్నదాత సుఖీభవ, ఉచిత సిలెండర్లు,ఉచిత బస్సు ప్రయాణం వంటి సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయన్నారు. ఆలమూరు మండలం చెముడులంకలో గురువారం ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పాలనపై ప్రజల అభిప్రాయాలు అడిగారు. అలాగే ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు సంబంధించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బండారు మాట్లాడుతూ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా రెండేళ్లలో విశేష అభివృద్ధి కూటమి ప్రభుత్వం సాధించిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రధానమంత్రి మోడీల ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి వైపు పరుగులు పెడుతుందన్నారు. అందులో భాగంగానే ఆలమూరు మండలం వ్యాప్తంగా గోదావరి వాటర్ అందించేందుకు కోట్లాది రూపాయలతో ప్రభుత్వం చర్యలు వేగంగా చేపడుతుందన్నారు. అలాగే త్వరలోనే కొత్త పింఛన్లు అర్హులందరికీ అందజేస్తామన్నారు. చెముడులంక వంతెనకు అప్రోచ్ రోడ్డు నిర్మించడంతోపాటు గ్రామంలో సిసి రోడ్లు నిర్మించినట్లు వివరించారు. కొత్త విద్యుత్ లైన్ ఏర్పాటు చేయడం ద్వారా మెరుగైన విద్యుత్ సరఫరా అందేలా చర్యలు చేపట్టామన్నారు. చెముడులంక నాలుగు లైన్ల జాతీయ రహదారిపై డివైడర్ సౌకర్యం కల్పించే విధంగా నేషనల్ హైవే అధికారులతో చర్చిస్తున్నట్లు ఎమ్మెల్యే బండారు తెలిపారు. అలాగే కొండేపూడి శివన్నారాయణ వీధిలో ఒక చోట నీరు నిలిచిపోతున్నందున వెంటనే అక్కడ నీరుపోయే విధంగా చర్యలు చేపట్టాలని ఎంపిడివో,ఆ గ్రామ ప్రత్యేక అధికారి ఏ.రాజుకు ఎమ్మెల్యే సూచించారు. ప్రజలు సంతృప్తి కరంగా ఉన్నారని రాబోయే స్థానిక ఎన్నికల్లో విజయ ధంకా మోగిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఆయన వెంట మండల టిడిపి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈదల సత్తబాబు, సలాది నాగేశ్వరరావు, డిసి చైర్మన్ మెర్ల గోపాలస్వామి, చొప్పెల్ల సొసైటీ అధ్యక్షులు నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, ఎంపిటీసి తమ్మన భాస్కరరావు, చెముడులంక కూటమి నాయకులు నాగిరెడ్డి వెంకటరత్నం, కొత్తపల్లి రాంబాబు,నాగిరెడ్డి సత్యానందం , సిరంగుల సతీష్, అడబాల వీర్రాజు,గుండుమళ్ల రామారావు,లంకలపల్లి అంజి, పలు గ్రామాల నుండి వచ్చిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చేనేతకు చేయూత.. నేతన్నల కుటుంబాలకు ఆర్థిక భరోసా

- నేతన్నల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం: వాసంశెట్టి సత్యం



**రామచంద్రపురం, పెన్ పవర్,ఆగస్టు 6:** చేనేత కార్మికులకు ఆర్థిక భరోసా కల్పించి, వారికి గౌరవప్రదమైన జీవనం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం అన్నారు.

జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం రామచంద్రపురం నియోజకవర్గంలోని కే.గంగవరం మండలం అద్దంపల్లి గ్రామంలో నిర్వహించిన నేతన్నలతో ముఖాముఖి సమావేశంలో ఆయన పాల్గొని వారి సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో చేనేత రంగాన్ని పునరుజ్జీవింపజేసేందుకు కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చీరాలలో అర్హులైన నేతన్నలకు ఏడాదికి రూ.25 వేల ఆర్థిక సాయం అందించే ప్రతిష్టాత్మక పథకాన్ని ప్రారంభించనున్నారని తెలిపారు. ఈ పథకం చేనేత కుటుంబాలకు ఎంతో ఊరటనిస్తుందని పేర్కొన్నారు. మగ్గంపై పనిచేసే నేతన్నలకు 200 యూనిట్ల వరకు, మరమగ్గంపై పనిచేసే వారికి 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందజేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. అలాగే ముద్ర రుణాలు,త్రిఫ్ట్ ఫండ్ వంటి పథకాల ద్వారా చేనేత కుటుంబాల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. చేనేత వస్త్రాలను కొనుగోలు చేయడం ద్వారా మన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడంతో పాటు వేలాది నేతన్న కుటుంబాలకు ఉపాధి కల్పించిన వారమవుతామని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి స్థానిక నేతన్నలను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. అనంతరం వాసంశెట్టి సత్యం స్వయంగా చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి నేతన్నలకు ప్రోత్సాహం అందించారు. దీనికి చేనేత కార్మికులు ఆనందం వ్యక్తం చేస్తూ ప్రభుత్వం, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, వాసంశెట్టి సత్యంకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కే.గంగవరం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మేడిశెట్టి రవికుమార్, స్వచ్ఛ ఆంధ్ర డైరెక్టర్ సలాది రమేష్, కూటమి పార్టీ నాయకులు, చేనేత కార్మికులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంఘాలు బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి.

- స్త్రీనిధి మేనేజింగ్ డైరెక్టర్, హరిప్రసాద్,బ్యాంకు లింకేజ్ అదనపు డైరెక్టర్ రామ్మోహన్.





**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్,ఆగస్టు, 06:** మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ రుణాల ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. స్త్రీనిధి మేనేజింగ్ డైరెక్టర్ హరిప్రసాద్, బ్యాంకు లింకేజీ అదనపు డైరెక్టర్ రామ్మోహన్ మండల మహిళా సమాఖ్యను సందర్శించి రుణాల మంజూరు, వినియోగం, వసూళ్ల పురోగతిని పరిశీలించారు. స్త్రీనిధి రుణాలకు సంబంధించిన పత్రాలు, సిబ్బంది కదలికల రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. అనంతరం ప్రత్తిపాడులో పద్మావతి మహిళా సంఘం సభ్యురాలు సింగిలీదేవి అనూష నిర్వహిస్తున్న అగరబత్తి తయారీ యూనిట్‌ను,ధర్మవరంలో జువ్వల సత్య నిర్వహిస్తున్న ఎంబ్రాయిడరీ యూనిట్‌ను సందర్శించారు. స్త్రీనిధి, బ్యాంకు రుణాలతో ఏర్పాటు చేసిన యూనిట్ల నిర్వహణ, రుణాల వినియోగం, వ్యాపార కార్యకలాపాల పురోగతిని పరిశీలించి లబ్ధిదారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. మహిళా సంఘాల సభ్యులు స్త్రీనిధి, బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి, వ్యాపార కార్యకలాపాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఎంలు రాయ్, భరత్, డీజీఎం శ్యామల, ఏజీఎం శివకుమార్, సీబీఓ ఫైనాన్స్ ఏపీఎం సన్యాసిరావు, మండల ఏపీఎం వెంకట్, స్త్రీనిధి మేనేజర్ నూకరత్నం, సీసీలు, మండల మహిళా సమాఖ్య సిబ్బంది పాల్గొన్నారు. ద

## రెవెన్యూ గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

-కిర్లంపూడి ఎంపీపీ తోట రవి.




**కిర్లంపూడి, పెన్ పవర్, ఆగస్టు,06:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కిర్లంపూడి ఎంపీపీ తోట రవి అన్నారు. కిర్లంపూడి మండలం వీరవరం గ్రామంలో గురువారం రెవిన్యూ గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ తోట రవి ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. సమావేశంలో వీరవరం టిడిపి పార్టీ అధ్యక్షుడు గొల్లపల్లి సూరిబాబు,కిర్లంపూడి మండలం అభివృద్ధి అధికారి హరికృష్ణ,తహసీల్దార్ కె సాయికిరణ్ రివెన్యూ సిబ్బంది, గ్రామ రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పిఠాపురం బ్రాంచ్ కెనాల్ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి







- ఆయకట్టు చివరి భూముల వరకు సాగునీరు అందేలా చర్యలు
- కలెక్టర్ హరేంధిర ప్రసాద్

**పిఠాపురం/గొల్లప్రోలు, పెన్ పవర్,ఆగస్టు 6:** పిఠాపురం బ్రాంచ్ కెనాల్ పరిధిలోని ఆయకట్టు చివరి భూముల వరకు సాగునీరు సమర్థవంతంగా అందేలా కాలువల అభివృద్ధి పనులను వేగవంతంగా,నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ జలవనరుల శాఖ ఇంజనీర్లను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ జలవనరుల శాఖ అధికారులతో కలిసి పిఠాపురం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా గొల్లప్రోలు కొత్త కలింగలు, బలకట్టు, నల్లకొండ, గాలికొండ ప్రాంతాల్లో జరుగుతున్న కాలువల అభివృద్ధి పనులు, రాజారావు బహాదుర్ చెరువు అభివృద్ధి పనులు, చెరువు మిగులు జలాల నిర్వహణను పరిశీలించారు. అదేవిధంగా 12వ స్లూయిస్ వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులు, నిధుల వినియోగం, కాంద్రకోట-- పిఠాపురం కాలువ అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతులకు సాగునీటి కొరత తలెత్తకుండా ప్రతిపాదించిన పనులన్నింటినీ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ లేకుండా ఇంజినీరింగ్ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ఈ పర్యటనలో ట్రైనీ కలెక్టర్ ప్రియ,ధవళేశ్వరం సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ పి.శ్రీనివాస్, గోదావరి డెల్టా ఛైర్మన్ ఎం.సునీల్ కుమార్, జలవనరుల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శేషగిరిరావు,డివిజనల్ ఇంజనీర్లు సంతోష్ కుమార్,రవికుమార్తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## లంక పొగాకు వ్యాపారంతో మా కుటుంబానికి ఎంతో అనుబంధం-కొత్తపేట ఎమ్మెల్యే బండారు



**ఆలమూరు, పెన్ పవర్, ఆగస్టు 06;** లంక పొగాకు వ్యాపారంతో తమ కుటుంబానికి ఎంతో అనుబంధం ఉందని తన తాతయ్య, తండ్రి ఈ వ్యాపారం ద్వారానే గుర్తింపు పొందారని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. లంక పొగాకు వ్యాపారం ఎక్కువ జరిగే ఆలమూరు మండలం చెముడులంక పర్యటనలో భాగంగా గురువారం పలువురు పొగాకు వ్యాపారులతో కూర్చుని ముచ్చటించారు. వ్యాపారం తీరుతెన్నులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ తన బాల్యం నుంచి ఈ పొగాకు వ్యాపారంపై అనుభవం ఉందన్నారు. అలాగే ఈ లంక గ్రామాల రైతులు, వ్యాపారులతో కూడా తన తండ్రుల కాలం నుంచి ఎంతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని గుర్తు చేసారు.

## డాక్టర్ అడ్డాల సేవాతత్పరత అభినందనీయం

### పుట్టినరోజు సందర్భంగా వృద్ధులకు నూతన వస్త్రాల పంపిణీ



**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 6:** కాకినాడ పరిసర ప్రాంతాల్లో ఏ స్వచ్ఛంద సంస్థ ఉచిత వైద్య శిబిరం నిర్వహించాలనుకున్నా, "నేనున్నాను" అంటూ ముందుండి విజయవంతం చేసే సేవాతత్పరుడు డాక్టర్ అడ్డాల సత్యనారాయణ అని విశ్రాంతి ఉపాధ్యాయులు నిమ్మకాయల వెంకటేశ్వరరావు కొనియాడారు.

రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో డాక్టర్ అడ్డాల సత్యనారాయణ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిమ్మకాయల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు దివంగత వంకా సత్యనారాయణ మనవడైన డాక్టర్ అడ్డాల సత్యనారాయణ కమ్యూనిస్టు భావజాలంతో నిరాడంబరంగా జీవిస్తూ, ఎవరికి ఏ కష్టం వచ్చినా అండగా నిలుస్తారని అన్నారు. శ్రీ సత్య దంత వైద్యశాల ద్వారా గత మూడు దశాబ్దాలుగా విశిష్ట సేవలు అందించినందుకు డాక్టర్ అడ్డాల సత్యనారాయణ జాతీయ,రాష్ట్ర స్థాయిలో పలు ప్రభుత్వ పురస్కారాలు అందుకున్నారని పేర్కొన్నారు. తన పుట్టినరోజును ఆర్భాటంగా కాకుండా వృద్ధుల మధ్య జరుపుకొని వారికి నూతన వస్త్రాలు అందజేయడం అభినందనీయమని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, పి.ధర్మచంద్ర రాజు తదితరులు పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com


# రాజకీయ కుట్రలో భాగంగానే మెగా డీఎస్సీపై వైసీపీ ఆరోపణలు



**మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు విమర్శ**

**కాకినాడ రూరల్, పెన్ పవర్,ఆగస్టు 6:** మెగా డీఎస్సీ నియామకాలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణలు పూర్తిగా రాజకీయ లబ్ధి కోసం చేస్తున్న కుట్రలో భాగమేనని టీడీపీ సీనియర్ నాయకులు,మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు విమర్శించారు.

గురువారం ఇంద్రపాలెం గ్రామంలో టీడీపీ కాకినాడ రూరల్ ఇన్‌చార్జి,మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఇంటింటికి టీడీపీ' కార్యక్రమంలో మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వర రావుతో కలిసి నులుకుర్తి వెంకటేశ్వరరావు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం రెండేళ్ల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా నులుకుర్తి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో జాబ్ క్యాలెండర్ విడుదల చేయకుండా నిరుద్యోగ యువతను మోసం చేసిందని ఆరోపించారు.ఎన్నికల హామీ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తొలి సంతకంతోనే మెగా డీఎస్సీ నిర్వహణకు ఆమోదం తెలిపారని గుర్తు చేశారు.మెగా డీఎస్సీ ద్వారా సుమారు 16 వేల మంది అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించారని, ఈ నియామకాలను అడ్డుకునేందుకు దాఖలైన సుమారు 200 కేసులను అధిగమించి ప్రభుత్వం పారదర్శకంగా నియామక ప్రక్రియను పూర్తి చేసిందన్నారు.ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు ఇప్పటికే శిక్షణ పూర్తి చేసుకుని విధుల్లో చేరుతున్న సమయంలో వైసీపీ నిరసనలు చేపట్టడం హాస్యాస్పదమని ఆయన ఎద్దేవా చేశారు. నిరుద్యోగ యువతలో అపోహలు సృష్టించే ప్రయత్నం మానుకుని, గత ఐదేళ్ల పాలనలో ఒక్క డీఎస్సీ కూడా ఎందుకు నిర్వహించలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ మాసుమేను మంగ గంగయ్య, క్లస్టర్ కన్వీనర్లు కర్రి వెంకటరాజు, సరిదే నాగహరినాథ్, మిరపల సూర్యప్రకాశ్, మద్దూరి స్వామి, కాళా సత్తిబాబు, చీపురుపల్లి జయేంద్రబాబు, గంజా రాంబాబు,కొండా వినాయక్, ఎలగా లోవరాజు, ఇంద్రపాలెం గ్రామ కమిటీ అధ్యక్షురాలు పిల్లి రమణమ్మ, గుత్తుల రామలింగేశ్వరరావు, పండూరు జయకృష్ణ, పలివెల శ్రీను, కదా ప్రసాద్, మురళి, శ్రీనుతో పాటు స్థానిక కూటమి నాయకులు, టీడీపీ కార్యకర్తలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## ఖర్చుపెట్టిన ప్రతి రూపాయి ప్రజలకు వివరిస్తాం



ఎమ్మెల్యే నెహ్రూ

**జగ్గంపేట, పెన్ పవర్, ఆగస్టు 6:** జగ్గంపేట ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు, టీటీడీ బోర్డు మెంబర్ జ్యోతుల నెహ్రూ గురువారం తిరుపతి నుంచి మీడియాతో ఫోన్లైన్ ద్వారా మాట్లాడారు. సీఎం చంద్రబాబు రాష్ట్ర ప్రగతి నివేదికను ప్రజల ముందుంచారని ఈ నివేదికలో చెప్పిన ప్రతీ అంకె వాస్తవమని ప్రతీ విషయం విజయానికి నిదర్శనమన్నారు. 2014-19 వరకు రాష్ట్ర జీడీపీ వృద్ధి రేటు 13.5 శాతం ఉండగా 2019-24 మధ్య అది 10.30 శాతానికి పడిపోయిందన్నారు. గత ఐదేళ్ల పాలన లక్ష్యం విద్వేషం, విధ్వంసమేనన్నారు. ఆర్థిక క్రమ శిక్షణ లేకపోవడంతో రాష్ట్రం రెండేళ్లు వెనుకబడిందన్నారు. గత ప్రభుత్వంలో ఒక్క కొత్త రోడ్డు వేయలేదని కూటమి ప్రభుత్వం వచ్చాక కిలోమీటర్ల కొద్దీ రోడ్లు వేస్తున్నామన్నారు. సీఎం నరేంద్ర మోడీ సహకారంతో సీఎం చంద్రబాబు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ రాష్ట్రాన్ని స్థిరమైన అభివృద్ధి పదం వైపు తీసుకు వెళుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ల కాలంలో 3800 కిలోమీటర్లు రోడ్లు నిర్మించడం జరిగిందన్నారు. అంతే కాకుండా 23 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించడం జరిగిందని ఆయన్ని సందర్భంగా స్పష్టం చేశారు. గడిచిన రెండేళ్లలో సంక్షేమానికి రూ.1.49 లక్షల కోట్లు అబివృద్ధి కార్యక్రమాలకు 1.34 లక్షల కోట్లు ఖర్చు చేయడం జరిగిందన్నారు. అంతేకాకుండా గత ప్రభుత్వం పెండింగ్ బిల్లులు రూ.19357 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా ఎన్టీఆర్ భరోసా, తల్లికి వందనం, అన్నదాత సుఖీ భవ, స్త్రీ శక్తి, దీపం పథకం, ఎన్టీఆర్ వైద్య సేవ వంటి పథకాల ద్వారా ప్రతి వర్గానికి మేలు చేయడం జరిగిందన్నారు. గత ఐదేళ్లలో జరిగిన విధ్వంసం నుంచి రాష్ట్ర పునర్నిర్మానం వైపు తీసుకెళ్తున్నామన్నారు. అప్పుల రాష్ట్రాన్ని అవకాశాలు రాష్ట్రంగా మార్చడమే కాక ప్రతి రూపాయి ప్రజలు కోసమే ఖర్చు పెడుతున్నామన్నారు. ఖర్చు పెట్టిన ప్రతీ రూపాయి ప్రజలకు వివరిస్తామని నెహ్రూ స్పష్టం చేశారు.

## కూటమి పాలనలో రాష్టం అన్ని విధాలా అభివృద్ధి, సంక్షేమం.

-రెండేళ్ల కూటమి పాలనపై టి రాయవరంలో ఎమ్మెల్యే సత్యప్రభ ఇంటింటా ప్రచారం.





**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, ఆగస్టు, 06:** రెండేళ్ల కూటమి పాలనలో రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి సాధించిందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా అన్నారు.

ప్రత్తిపాడు మండలం టి రాయవరం గ్రామంలో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన,అభివృద్ధి,సంక్షేమంపై నిర్వహించిన ఇంటింటా ప్రచారం కార్యక్రమంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు.గ్రామ టీడీపీ నాయకుడు తటవర్తి సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో టీడీపీ ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస్ బాబా,కూటమి నాయకులు సింగిలిదేవి సత్తిరాజు, సుంకర సోమరాజు,గొంతిన సురేష్,అడ్డాల త్రిమూర్తులు,చక్కపల్లి మందేశ్వరరావు,లొండ లోవరాజు,యర్రాబత్తుల గోవిందునాయుడు,రామకుర్తి కామేష్ తదితరులు పాల్గొన్నారు.

## క్షేత్రస్థాయిలో బిజెపి బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి.

-కిర్లంపూడి మండల బిజెపి కార్యవర్గ సమావేశంలో కుండల సాయికుమార్ యాదవ్.





**కిర్లంపూడి, పెన్ పవర్, ఆగస్టు 06:** క్షేత్రస్థాయిలో భారతీయ జనతా పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జగ్గంపేట నియోజకవర్గం భారతీయ జనతా పార్టీ ఇంచార్జ్ కుండల సాయికుమార్ యాదవ్ అన్నారు.కాకినాడ జిల్లా కిర్లంపూడి మండల భారతీయ జనతా పార్టీ కార్యవర్గ సమావేశం ఏఎన్ఎల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. మండల బిజెపి అధ్యక్షుడు శరకణం రాజబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి జగ్గంపేట నియోజకవర్గం బిజెపి ఇన్చార్జి కుండల సాయి కుమార్ యాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కిర్లంపూడి మండలం ఇంచార్జ్ భీమశంకర్. గంగరాజు. ఎస్ ఎస్ రాంకుమార్ పాల్గొన్న ఈ కార్యక్రమంలో కుండల సాయికుమార్ పార్టీ బలోపేతం, మండల వ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలు, భవిష్యత్ కార్యాచరణపై నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా చర్చించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని, ప్రతి కార్యకర్త పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. అంతేకాకుండా ఈ యొక్క కార్యక్రమంలో కాకినాడ జిల్లా ఎగ్జిక్యూటర్ నెంబర్స్ అల్లు శివరామకృష్ణ,ఐవివి సత్యనారాయణమూర్తి, శరకణం కన్నారావు, మండల ప్రధాన కార్యదర్శిలు కోనేటి శ్రీనివాసరావు, మిరియాల వెంకటేష్, మండల ఉప అధ్యక్షులు భునగిరి కాశీ విశ్వనాథం, బుద్ధ పెద్ద కాపు, కొప్పిశెట్టి జగన్, ఈసరపు శివ, పెదగాడ లోవరాజు, ఎడారి రామచంద్రరావు, మండల కార్యదర్శిలు కర్రీ పురుషోత్తం, బొడ్డేటి చిన్నబ్బాయి, శరకణం సన్యాసిరావు,జి ఎన్ వి సత్యనారాయణ, మండల ట్రెజర్ బుర్రె విజయ్ కుమార్, మండల యువ మోక్షా అధ్యక్షులు పడాల శివ, మండల మహిళా మోక్ష అధ్యక్షురాలు తణుకు మంగతాయారు, మండల యువ మోక్ష ప్రధాన కార్యదర్శి సామన యువరాజు, సీనియర్ బిజెపి నాయకులు బొడ్డేటి బాబురావు, సాయి ధర మల్లేశ్వర, ఆప్పికొండ శివ, పెద్దిరెడ్డి గోపాల్, గంధం సత్యనారాయణ, చింతపల్లి చిట్టిబాబు, కోలా కృష్ణ, గొంతెన ఎస్ఎస్ దుర్గ గండే నాని, గండే సత్యనారాయణ, శెట్టి గంగా మహేష్, నైధాన్ రవి, పప్పు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్బంగా పార్టీలో జాయిన్ అయిన వారికి పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు.

## బ్యాంకు రుణాలను మహిళా సంఘాలు సద్వినియోగం చేసుకోవాలి.

-స్త్రీనిధి మేనేజింగ్ డైరెక్టర్, హరిప్రసాద్,బ్యాంకు లింకేజ్ అదనపు డైరెక్టర్ రామ్మోహన్.





**కిర్లంపూడి,పెన్ పవర్,ఆగస్టు, 06:** బ్యాంకు రుణాలను మహిళా సంఘాలు సద్వినియోగం చేసుకోవాలని స్త్రీనిధి మేనేజింగ్ డైరెక్టర్ హరిప్రసాద్, బ్యాంకు లింకేజీ అదనపు డైరెక్టర్ రామ్మోహన్ అన్నారు. కిర్లంపూడి మండల మహిళా సమాఖ్యను సందర్శించి రుణాల మంజూరు, వినియోగం, వసూళ్ల పురోగతిని పరిశీలించారు. స్త్రీనిధి రుణాలకు సంబంధించిన పత్రాలు, సిబ్బంది కదలికల రిజిస్టర్‌ను తనిఖీ చేశారు.స్త్రీనిధి, బ్యాంకు రుణాలతో ఏర్పాటు చేసిన యూనిట్ల నిర్వహణ, రుణాల వినియోగం, వ్యాపార కార్యకలాపాల పురోగతిని పరిశీలించి లబ్ధిదారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు.మహిళా సంఘాల సభ్యులు స్త్రీనిధి, బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి, వ్యాపార కార్యకలాపాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో డీపీఎంలు రాయ్, భరత్, డీజీఎం శ్యామల, ఏజీఎం శివకుమార్, సీబీఓ ఫైనాన్స్ ఏపీఎం, సన్యాసిరావు, ఏపిఎం,శరకణం వేదకుమారి, స్త్రీ నిధి మేనేజర్ కస్తూరి,సీసీలు, మండల మహిళా సమాఖ్య సిబ్బంది పాల్గొన్నారు.

# జర్నలిస్టుల రైల్వే రాయితీల పునరుద్ధరణకు ఎంపీలు చొరవ చూపాలి

### అవినాష్ రెడ్డి బాటలో అన్ని పార్టీల ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తేవాలి





**కొత్తపేట, పెన్ పవర్,ఆగస్టు 6:** అక్రిడిటేషన్ పొందిన జర్నలిస్టులకు రైల్వే ప్రయాణ రాయితీలను తక్షణమే పునరుద్ధరించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జర్నలిస్టు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీనియర్ జర్నలిస్ట్ జగత రాంబాబు, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (ఏపీడబ్ల్యుజేఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి వాకాడ బాబులు వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు.జర్నలిస్టుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం 1950వ దశకంలోనే రైల్వే ప్రయాణ రాయితీ పథకాన్ని ప్రవేశపెట్టిందని వారు గుర్తు చేశారు. అనంతరం 2009లో కూపన్ బుక్ విధానాన్ని రద్దు చేసి, ఫొటో గుర్తింపు కార్డు ఆధారంగా రాయితీ సౌకర్యాన్ని అమలు చేశారని తెలిపారు. తర్వాత జర్నలిస్టులతో పాటు వారి జీవిత భాగస్వామి, పిల్లలకు కూడా రైల్వే చార్జీలపై 50 శాతం రాయితీ వర్తింపజేసిందని పేర్కొన్నారు.అయితే వివిధ కారణాలతో ఈ రాయితీలను నిలిపివేయడంతో దేశవ్యాప్తంగా జర్నలిస్టులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా వార్తల సేకరణ కోసం తరచూ ప్రయాణాలు చేయాల్సి వచ్చే ఫుల్‌టైమ్, పార్ట్‌టైమ్ జర్నలిస్టులకు ఈ రాయితీలు ఎంతో ఉపయోగపడేవని తెలిపారు. ప్రస్తుతం తక్కువ గౌరవ వేతనాలతో విధులు నిర్వహిస్తున్న జర్నలిస్టులకు ప్రయాణ వ్యయం భారంగా మారిందని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో వైఎస్సార్సీపీ కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు లేఖ రాసి రైల్వే రాయితీల పునరుద్ధరణ కోరడాన్ని జర్నలిస్టు సంఘాలు స్వాగతించాయి. జర్నలిస్టుల సమస్యను కేంద్రం దృష్టికి తీసుకెళ్లినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశాయి.అదేవిధంగా, ఈ అంశాన్ని రాజకీయాలకు అతీతంగా పరిగణించి రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలకు చెందిన ఎంపీలు కూడా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి, జర్నలిస్టులకు రైల్వే ప్రయాణ రాయితీలను తిరిగి అమలు చేయించేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల సంక్షేమానికి ఇది కీలక నిర్ణయమవుతుందని, కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి త్వరితగతిన రాయితీలను పునరుద్ధరించాలని కోరారు.

# భారత మహిళల దక్షిణాఫ్రికా పర్యటనలో మార్పులు.. కొత్తగా టీ20 సిరీస్ ఖరారు

**భారత మహిళల జట్టు దక్షిణాఫ్రికా పర్యటనలో మార్పులు**
**టూర్‌కు కొత్తగా మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను జోడింపు**
**2027 ఛాంపియన్స్ ట్రోఫీ సన్నద్ధతలో భాగంగా ఈ నిర్ణయం**
**డిసెంబర్ 9 నుంచి 30 వరకు టెస్ట్, వన్డే, టీ20 సిరీస్‌లు**
**గత పర్యటనలో ఓటమికి బదులు తీర్చుకునే అవకాశం**



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత మహిళల క్రికెట్ జట్టు డిసెంబర్ 2026లో చేపట్టనున్న దక్షిణాఫ్రికా పర్యటనకు సంబంధించి కీలకమైన మార్పు చోటుచేసుకుంది. ముందుగా ఖరారైన షెడ్యూల్‌కు అదనంగా మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను జోడించినట్లు క్రికెట్ సౌతాఫ్రికా (సీఎస్ఏ) అధికారికంగా ప్రకటించింది. 2027 ఫిబ్రవరిలో శ్రీలంక వేదికగా జరగనున్న తొలి ఐసీసీ ఉమెన్స్ ఛాంపియన్స్ ట్రోఫీకి జట్లను సన్నద్ధం చేసే లక్ష్యంతో ఈ టీ20 సిరీస్‌ను చేర్చినట్లు సీఎస్ఏ స్పష్టం చేసింది. ఈ పర్యటన డిసెంబర్ 9 నుంచి 30 వరకు జరగనుంది. ఈ మార్పుతో, పర్యటన చివర్లో టీ20 సిరీస్ నిర్వహించనున్నారు. డిసెంబర్ 26న బెనోనిలోని విల్లోమూర్ పార్క్‌లో పండుగ వాతావరణంలో 'బాక్సింగ్ డే' టీ20 మ్యాచ్ జరగనుంది. మిగిలిన రెండు టీ20 మ్యాచ్‌లు డిసెంబర్ 29, 30 తేదీలలో పోచెఫ్‌స్ట్రూమ్‌లోని ఎన్‌డబ్ల్యూసీ ఓవల్‌లో జరుగుతాయి. ఈ పర్యటన తొలుత డిసెంబర్ 9 నుంచి 12 వరకు గెబెర్హాలోని సెయింట్ జార్జ్ పార్క్‌లో ఏకైక టెస్టు మ్యాచ్‌తో ప్రారంభమవుతుంది. ఈ టెస్టు అనంతరం ఇరు జట్ల మధ్య మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ జరగనుంది. ఈ వన్డేలు ఐసీసీ ఉమెన్స్ ఛాంపియన్‌షిప్ (×ౌజ)లో భాగం. డిసెంబర్ 16 నుంచి 22 వరకు పార్ల్, కేప్ టౌన్, బ్లూమ్‌ఫోంటెయిన్ నగరాలు ఈ వన్డే మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇస్తాయి.
ఈ సవరించిన షెడ్యూల్‌పై క్రికెట్ సౌతాఫ్రికా సీఈఓ ఫోలెట్సీ మొసెకీ హర్షం వ్యక్తం చేశారు. "భారత పర్యటనకు టీ20 సిరీస్‌ను జోడించడం సంతోషంగా ఉంది. పండుగ సీజన్‌లో జరిగే ఈ మ్యాచ్‌లు, వచ్చే ఏడాది ఛాంపియన్స్ ట్రోఫీకి మా ప్రోటీస్ మహిళల జట్టు సన్నద్ధతకు ఎంతగానో ఉపయోగపడతాయి. ప్రపంచ క్రికెట్‌లో భారత్ అత్యంత బలమైన జట్లలో ఒకటి. అలాంటి జట్టుతో మూడు ఫార్మాట్లలో తలపడటం మాకు విలువైన అనుభవాన్ని ఇస్తుంది," అని ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో టీ20 ప్రపంచకప్ సన్నాహాల్లో భాగంగా భారత మహిళల జట్టు దక్షిణాఫ్రికాలో ఐదు టీ20ల సిరీస్‌లో పాల్గొంది. అయితే, ఆ సిరీస్‌ను 1-4 తేడాతో కోల్పోయింది. ఇప్పుడు ఈ కొత్త సిరీస్‌తో ఆ ఓటమికి బదులు తీర్చుకునే అవకాశం భారత జట్టుకు లభించింది.

## ఆ సమయంలో అమ్మాయిలతో జాగ్రత్త వైభవ్.. కాంబ్లీ, పృథ్వీ షాలలా అవ్వకూడదు: భారత మాజీ క్రికెటర్

**హైదరాబాద్ పెన్ పవర్:** కేవలం 15 ఏళ్లకే జాతీయ జట్టులో చోటు సంపాదించి, దిగ్గజ ఆటగాడు సచిన్ టెండూల్కర్ రికార్డును బద్దలు కొట్టాడు వైభవ్ సూర్యవంశీ. అద్భుతమైన ప్రతిభతో అతి పిన్న వయసులోనే అసాధారణ విజయాలు సాధిస్తున్న ఈ యువ కెరటంపై ప్రశంసలతో పాటు, అతడి భవిష్యత్తుపై ఆందోళనలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో భారత మాజీ క్రికెటర్ రాబిన్ ఊతప్ప ఈ యువ ఆటగాడిని కాపాడుకోవాల్సిన ఆవశ్యకతపై కీలక వ్యాఖ్యలు చేశాడు. 2026 ఐపీఎల్‌లో టాప్ స్కోరర్‌గా నిలిచి అందరి దృష్టిని ఆకర్షించిన వైభవ్ సూర్యవంశీ, ఆ తర్వాత భారత జట్టులోకి అడుగుపెట్టాడు. పురుషుల క్రికెట్‌లో అత్యంత పిన్న వయసులో అరంగేట్రం చేసిన భారత ఆటగాడిగా సచిన్ పేరిట ఉన్న రికార్డును సూర్యవంశీ తిరగరాశాడు. ఇటీవలి జింబాబ్వే పర్యటనలో తన నాలుగో మ్యాచ్‌లోనే తొలి అంతర్జాతీయ అర్ధశతకం నమోదు చేసి తన ప్రతిభను చాటుకున్నాడు. ఈ వేగవంతమైన ఎదుగుదలపై రాబిన్ ఊతప్ప ఒక యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడుతూ.. "వైట్ బాల్ క్రికెట్‌లో సచిన్ కంటే పెద్ద ప్రభావం చూపగల సామర్థ్యం అతడికి ఉంది. కానీ, అతడిని ఎలా ముందుకు నడిపిస్తామన్నదే ముఖ్యం. గతంలో ఎంతో మంది ప్రతిభావంతులైన ఆటగాళ్లు భారత క్రికెట్‌లోకి వచ్చారు. వినోద్ కాంబ్లీ, పృథ్వీ షా లాంటి వాళ్లను చూశాం. 17-18 ఏళ్ల వయసులో వారు ఏమవుతారని అందరూ అంచనాలు వేశారు. కానీ, అకస్మాత్తుగా వారు దారి తప్పారు" అని గుర్తుచేశాడు. "వైభవ్‌కు ఇదే మొదటి పరీక్ష. ఇప్పుడు అతడికి 15 ఏళ్లు. మరో ఐదేళ్ల పాటు అంటే 20 ఏళ్లు వచ్చే వరకు ఆటపైనే పూర్తి ఏకాగ్రతతో ఉండగలడా? అతడిని చూసుకోవడానికి చాలా మంది ఉన్నారు. కానీ, అతను ఆటపైనే దృష్టి పెట్టాలి. అతను అన్ని రకాల ప్రకటనలు, డీల్స్‌ను తిరస్కరించడం అభినందనీయం. 18 ఏళ్లు వచ్చాక అతడిని ఓ పురుషుడిగా చూడటం మొదలుపెడతారు. అమ్మాయిల నుంచి వచ్చే అటెన్షన్ కూడా పెరగొచ్చు. అది ఆటగాళ్లను దారి మళ్లించగలదు" అని ఊతప్ప హెచ్చరించాడు. అంతేకాకుండా వైభవ్‌ను ప్రస్తుతానికి సోషల్ మీడియాకు దూరంగా ఉంచడం ఉత్తమమని ఊతప్ప సూచించాడు. "ఈ కుర్రాడు క్రికెట్ కోసమే పుట్టాడు. విరాట్ కోహ్లీ విషయంలోనూ మనకు అలాగే అనిపించింది. అతడిని ఆ బబుల్‌లోనే బతకనివ్వండి" అని చెప్పుకొచ్చాడు. కాగా, సెప్టెంబర్ 19న ప్రారంభమయ్యే ఆసియా క్రీడల్లో వైభవ్ సూర్యవంశీ తదుపరి మ్యాచ్ ఆడనున్నాడు.



## ధోనీ గది ఎప్పుడూ తెరిచే ఉంటుంది.. కానీ ఒక కండిషన్: ఆసక్తికర విషయాలు చెప్పిన రహానే

- ధోనీ అందరిలాంటి సాధారణ వ్యక్తి అని చెప్పిన రహానే
- అతని గది తలుపులు సహచరుల కోసం ఎప్పుడూ తెరిచే ఉంటాయని వెల్లడి
- కానీ తలుపు మూసి ఉంటే మాత్రం లోపలికి ఎవరికీ అనుమతి ఉండదని స్పష్టీకరణ
- సిరీస్‌ల సమయంలో సోషల్ మీడియా యాప్‌లను డిలీట్ చేస్తానని వెల్లడి
- బెన్ స్టోక్స్ సలహాతోనే ఈ అలవాటు చేసుకున్నానని తెలిపిన రహానే






**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ చాలా ప్రశాంతమైన, సాధారణ వ్యక్తి అని, సహచర ఆటగాళ్ల కోసం అతని గది తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని సీనియర్ క్రికెటర్ అజింక్యా రహానే అన్నాడు. ఇటీవల అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన రహానే, ధోనీతో తనకున్న అనుబంధాన్ని ఓ పాడ్‌కాస్ట్‌లో పంచుకున్నాడు.
రహానే మాట్లాడుతూ.. "ధోనీ చాలా కూల్, అందరిలాగే ఓ సాధారణ మనిషి. అతని గది తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయి. చాలాసార్లు మేం 10 నుంచి 15 మంది, కొన్నిసార్లు జట్టు మొత్తం ఆయన గదిలోనే ఉండేవాళ్లం. అయితే, అతని గది తలుపు మూసి ఉంటే మాత్రం ఎవరూ లోపలికి వెళ్లే సాహసం చేసేవారు కాదు" అని గుర్తుచేసుకున్నాడు. రహానే తన అంతర్జాతీయ అరంగేట్రం (టెస్టు, వన్డే, టీ20) ధోనీ కెప్టెన్సీలోనే చేయడం, ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ తరఫున కూడా కలిసి ఆడటం గమనార్హం.
ఇదే సందర్భంగా తాను సిరీస్‌ల సమయంలో మానసిక ప్రశాంతత కోసం సోషల్ మీడియాకు పూర్తిగా దూరంగా ఉండేవాడినని రహానే వెల్లడించాడు.
"సిరీస్ జరుగుతున్నప్పుడు నేను అన్ని సోషల్ మీడియా యాప్‌లను డిలీట్ చేస్తాను. 2017లో ఐపీఎల్‌లో కలిసి ఆడినప్పుడు ఇంగ్లండ్ ఆటగాడు బెన్ స్టోక్స్ ఈ సలహా ఇచ్చాడు. అప్పటినుంచి దీన్ని పాటిస్తున్నా" అని చెప్పాడు. గదిలో ఉన్నప్పుడు నెట్‌ఫ్లిక్స్‌లో ఏదైనా చూడటం, పుస్తకాలు చదవడం, కుటుంబంతో మాట్లాడటం వంటివి చేయడం ద్వారా మానసికంగా ఉల్లాసంగా ఉండేవాడినని రహానే వివరించాడు.

# నెగెటివిటీపై తీవ్రంగా కలత చెందిన డిజిటల్ ప్రిన్సెస్

రోజ్-గోల్డ్ సీక్విన్డ్ దుస్తుల్లో మెరిసిపోతున్న రూహి సింగ్





డేటా -డిజిటల్ యుగంలో సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, కంటెంట్ క్రియేటర్లు వెండితెరపై అడుగుపెట్టడం ఒక కొత్త ట్రెండ్‌గా మారింది. లక్షలాది మంది ఫాలోవర్లు ఉన్న డిజిటల్ తారలు సినిమాలో నటించడం వల్ల ప్రాజెక్ట్‌లకు తక్షణ ప్రచారం దక్కుతుందనేది నిజమే అయినా... ఆ ఫాలోయింగ్ థియేటర్లలో టికెట్లు తెగే మంత్రంగా మారుతుందా? లేదా? అనే అంశంపై తీవ్రమైన విశ్లేషణ మొదలైంది. సోషల్ మీడియాలో వచ్చే విమర్శలు, ట్రోలింగ్‌ను తట్టుకుంటూ ముందుకు సాగడం ఒక ఎత్తైతే, నటన ద్వారా ప్రేక్షకులను మెప్పించడం మరొక ప్రధాన సవాలుగా నిలుస్తోంది. ఇటీవల నటుడు రాఘవ్ జుయల్, ప్రముఖ కంటెంట్ క్రియేటర్ నిహారిక ఎన్ఎమ్ సోషల్ మీడియాలో వచ్చే ప్రతికూలతలపై స్పందిస్తూ --కుచ్ తో లోగ్ కహేంగే, లోగో కా కామ్ హై కెహ్నా-- అంటూ స్పష్టం చేశారు. నెగెటివిటీని పట్టించుకోకుండా తమ పనిపై మాత్రమే దృష్టి పెడతామని చెప్పిన విధానం ప్రతికూలతలను ఎదుర్కొనే నైజానికి అద్దం పడుతోంది. అయితే సోషల్ మీడియాలో మిలియన్ల కొద్దీ ఫాలోవర్లు ఉన్నా అది బాక్సాఫీస్ విజయానికి గ్యారెంటీ కాదని ఇటీవలి పరిణామాలు రుజువు చేస్తున్నాయి. ఇన్‌స్టాలో 34లక్షల మంది పైగా ఫాలోవర్లు ఉన్న నిహారిక ఎన్ఎమ్ కథానాయికగా నటించిన -భాయ్ తేరా స్టార్ హై- చిత్రం మొదటి రోజు పాతిక లక్షల స్వల్ప వసూళ్లను మాత్రమే సాధించింది. డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లలో ఫ్రీగా చూసే కంటెంట్‌కి ఉత్సాహం చూపే నెటిజన్లు, థియేటర్‌కి వచ్చి టికెట్ కొని సినిమా చూడటానికి కేవలం ఫాలోయింగ్ ఒక్కటే సరిపోదని ఈ ఫలితం స్పష్టం చేసింది. డిజిటల్ పాపులారిటీ వల్ల సినిమాకి ఆరంభంలో కొంత పబ్లిసిటీ లభించినా థియేటర్ రన్ అనేది పూర్తిగా నటన, కథాబలంతో పాటు ఇంకా చాలా చాలా అంశాలపై ఆధారపడి ఉంటుంది. అదే సమయంలో డిజిటల్ మీడియా నుండి వచ్చి నటన ద్వారా నిరూపించుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి. క్రియేటర్ ధర్నా దుర్గా ఓటీటీ చిత్రం -మా బహెన్-లో కనబరిచిన నటనకు ప్రేక్షకుల నుండి మంచి ప్రశంసలు దక్కాయి. సోషల్ మీడియా ఇమేజ్‌ను పక్కన పెట్టి.. పాత్రకు తగ్గట్టుగా ప్రాణం పోస్తే ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారని ఆమె నిరూపించారు. అలాగే 20 మిలియన్ల కంటే ఎక్కువ ఫాలోవర్లు ఉన్న భువన్ బామ్ -కుకూ కీ కుండలి- చిత్రంతో వెండితెరకు పరిచయం అవుతుండగా... ఎల్విష్ యాదవ్ కూడా టైగర్ ష్రాఫ్‌తో కలిసి నటించేందుకు సిద్ధమవుతున్నారు. ముగింపుగా... సోషల్ మీడియా నెట్‌వర్కింగ్ క్రియేటర్లకు సినీ పరిశ్రమ తలుపులు సులువుగా తెరుచుకునేలా తోడ్పడవచ్చు కానీ... పరిశ్రమలో నిలదొక్కుకోవడానికి మాత్రం నిజమైన ప్రతిభ, స్క్రీన్ ప్రెజెన్స్.. నటన మాత్రమే ప్రామాణికం. ట్రోలింగ్‌ను దాటుకుని రావడం ఎంత ముఖ్యమో.. కంటెంట్ క్రియేటర్ అనే ముద్ర నుంచి బయటపడి నిజమైన నటుడిగా గుర్తింపు తెచ్చుకోవడం అంతకంటే ప్రధానం. నటనలోని నాణ్యత, బలమైన కథనం ఉన్నప్పుడే డిజిటల్ స్టార్ల సినీ ప్రయాణం సుదీర్ఘంగా సాగుతుంది.



Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 4-79, Revenue Colony, Tammireddy Palem, Kottapeta Editor : Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A3664 , e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965